
ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY

5



జోగుళాంబ గద్వాల జిల్లా వార్తలు

శుక్రవారం 28 నవంబరు 2025

ఉష్ణోగ్రతలు గరిష్ఠం : 28.0 । కనిష్ఠం : 18.0

నామినేషన్ల ప్రక్రియ పకడ్బందీగా నిర్వహించాలి

గద్వాల/ధరూరు, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): గ్రామ పంచాయతీ ఎన్నికల నామినేషన్ ప్రక్రియను పకడ్బందీగా నిర్వహించాలని జోగుళాంబ గద్వాల జిల్లా కలెక్టర్ బీఎం సంతోష్ సూచించారు. గురువారం గద్వాల మండలంలోని పూడూరు నామినేషన్ సెంటర్‌ను పరిశీలించారు. దాని పరిధిలోని ఎర్రవల్లి, మేలచెరువు, కొండపల్లి రేపల్లి గ్రామాల ఓటర్ లిస్టును పరిశీలించారు. అదేవిధంగా ధరూర్‌లోని నామినేషన్ సెంటర్‌తో పాటు దాని పరిధిలోని జాంపల్లి, దోర్నాల ఓటర్ లిస్టులను తనిఖీ చేశారు. పోటీచేయు అభ్యర్థులకు నామినేషన్‌కు అవసరమైన సామగ్రిని రిటర్నింగ్ అధికారులు సిద్ధంగా ఉంచుకోవాలని సూచించారు. అన్ని విషయాలను తెలుసుకోవచ్చని సూచించారు. అదేవిధంగా ధరూర్ పంచాయతీ కార్యాలయంలో నామినేషన్ల ప్రక్రియను పరిశీలించారు. కలెక్టర్ వెంట అదనపు కలెక్టర్ నర్సింగ రావు, ఇన్‌చార్జి డీపీవో నాగేంద్రం, ఇతర అధికారులు ఉన్నారు.



పూడూరు నామినేషన్ కేంద్రాన్ని తనిఖీ చేస్తున్న జోగుళాంబ గద్వాల కలెక్టర్ బీఎం సంతోష్

మంచు తెరల మధ్య.. జీవన పయనం




చలికాపుకుంటున్న యువకులు



బొంతల విక్రయానికి వెళ్తున్న వ్యక్తి




నాగర్‌కర్నూల్ కేసరి సముద్రం చెరువులో చేపలు పడుతున్న మత్స్యకారులు



మినీ ట్యాంకుబండ్ సమీపంలో సూర్యోదయ అందం

చలికాలం మొదలైంది. తెల్లవారుజామున మంచుకురిసే వేళలో ప్రజలు జీవన పయనాన్ని సాగిస్తున్నారు. మునిసిపల్, కార్మికులు తలకు స్కార్ఫ్‌లు చుట్టుకొని విధుల్లో నిమగ్నం అవుతున్నారు. హోటళ్ల వద్ద టీ తాగుతూ పొయ్యి మంటలకు చలికాపుకుంటున్నారు. క్రీడాకారులు, యువకులు చలిని లెక్క చేయకుండా మైదానాలకు చేరుకుంటున్నారు. మత్స్యకారులు చల్లని చలిలో.. చేపలు పడుతున్నారు. నాగర్‌కర్నూల్ జిల్లా కేంద్రంలో గురువారం తెల్లవారుజామున కనిపించిన దృశ్యాలను 'ఆంధ్రజ్యోతి' కెమెరా క్లిక్ మనిపించింది.

- ఆంధ్రజ్యోతి స్టాఫ్ ఫొటోగ్రాఫర్, మహబూబ్‌నగర్



నాగర్‌కర్నూల్ మినీ ట్యాంక్ బండ్ వద్ద బుద్ధభగవానుడు

రూరల్‌కు ఓకే.. అర్బన్‌కు ఎప్పుడు..?

- వడ్డీ లేని రుణాలపై ప్రశ్నిస్తున్న అర్బన్ మహిళా సంఘాల సభ్యులు
- గ్రామీణ ప్రాంత సంఘాలకు రుణాలు మంజూరు చేస్తున్న ప్రభుత్వం
- జిల్లాలోని ఐదు మునిసిపాలిటీల్లో 2,401 మహిళా సంఘాలు



పెబ్బేరులో మహిళా సంఘాల సభ్యులకు రుణాల చెక్కును అందిస్తున్న ఎమ్మెల్యే, కలెక్టర్(ఫైల్)

వనపర్తి టౌన్, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): మహిళలు ఆర్థికాభివృద్ధి సాధించేలా ప్రభుత్వాలు బ్యాంకు లింకేజీ ద్వారా ఆర్థిక చేయూత అందిస్తున్నాయి. ఇందులో భాగంగానే రాష్ట్రంలో మహిళా స్వయం సహాయక సంఘాలకు ప్రభుత్వం వడ్డీ లేని రుణాలను విడుదల చేసింది. బ్యాంకుల నుంచి రుణాలు తీసుకుని క్రమం తప్పకుండా చెల్లించే మహిళా సంఘాలకు వడ్డీ లేని రుణాల పథకం వర్తిస్తుందని అధికారులు అంటున్నారు. తాజాగా జిల్లాలోని గ్రామీణ ప్రాంతాల్లోని మహిళా సంఘాల సభ్యులకు వర్తించిన ఈ పథకం తమకు ఎప్పుడు వర్తింపజేస్తారని పట్టణ ప్రాంతాల్లోని మహిళా సంఘాల సభ్యులు ప్రశ్నిస్తున్నారు.

వనపర్తి జిల్లాలో ఐదు మునిసిపాలిటీలు..

జిల్లాలోని వనపర్తి, పెబ్బేరు, కొత్తకోట, ఆత్మకూరు, అమరచింతతో కలిపి ఐదు మునిసిపాలిటీల్లో 2,401 స్వయం సహాయక సంఘాలు ఉన్నాయి. వనపర్తిలో 1,296, పెబ్బేరులో 288, కొత్తకోటలో 399, ఆత్మకూరులో 217, అమరచింతలో 201సంఘాలు ఉన్నాయి. వీటిలో 24,476 మంది సభ్యులుగా ఉన్నారు. ప్రస్తుతం వడ్డీలేని రుణాల కోసం పట్టణ ప్రాంతాల్లోని మహిళా సంఘాల సభ్యులు తమకు ఈ పథకం ఎప్పుడు వర్తింపజేస్తారని ఆర్పీల చుట్టూ తిరుగుతున్నారు. పట్టణ ప్రాంతాల్లోని మహిళా సంఘాల సభ్యులకు గతంలో 2019 డిసెంబరులో ఒక సారి, తిరిగి 2020 జనవరిలో ఒకసారి వడ్డీ లేని రుణాలు అందాయి. నాటి నుంచి నేటి వరకు వడ్డీ లేని రుణాలు విడుదల కాలేదు. తాజాగా గ్రామీణ ప్రాంత మహిళ సంఘాలకు ప్రభుత్వం వడ్డీ లేని రుణాలు విడుదల చేసింది.

గ్రామీణంలో 5757 సంఘాలు...

జిల్లాలోని గ్రామీణ ప్రాంతాల్లో 5,757 మహిళా సంఘాలు ఉన్నాయి. వారికి ప్రభుత్వం రూ. 3 కోట్ల 12 లక్షలను బ్యాంకుల ద్వారా వారివారి ఖాతాల్లో జమ చేసింది. ఈ మొత్తాన్ని ఏప్రిల్ నుంచి జూన్ మాసాల్లో రుణాలు పొందిన సభ్యులకు వర్తింపజేసింది. రుణాలు పొందిన సభ్యులకు బ్యాంకు వడ్డీ పెరిగి భారంగా మారిన తరుణంలో వడ్డీ డబ్బులు తిరిగి వారి ఖాతాలో జమ కావడంతో కాస్త ఆర్థిక ఉపశమనం కలిగింది. అర్బన్ ఏరియాల్లోని మహిళా సంఘాల సభ్యులకు కూడా వడ్డీ లేని రుణాలు అందించాలని మహిళలు కోరుతున్నారు.

పట్టణ ప్రాంతాలకు కూడా వర్తింపజేయాలి



వడ్డీలేని రుణాలను పట్టణ ప్రాంతాల్లోని సంఘాలకు కూడా వర్తింపజేయాలి. వడ్డీ డబ్బులు తిరిగి సంఘజ సభ్యుల ఖాతాలో జమ చేయడం వల్ల ఆర్థిక వెసులుబాటు కలుగుతుంది.

- షబాన బేగం, మహిళా సంఘం సభ్యురాలు, వనపర్తి

ప్రభుత్వం విడుదల చేయాలి



వడ్డీ లేని రుణాలపై ప్రభుత్వం నుంచి స్పష్టమైన ఆదేశాలు ఉన్నాయి. ప్రభుత్వం నిధులు విడుదల చేసిన వెంటనే జిల్లాలోని ఐదు మునిసిపాలిటీల పరిధిలో గల సంఘాల సభ్యుల ఖాతాలో జమ చేయిస్తాం.

బాలరాజు, మహిళా సంఘాల జిల్లా కోఆర్డినేటర్, వనపర్తి



జమ్మిచేడులో వరి కోస్తున్న యంత్రం

ఆయకట్టు పరిధిలో జోరుగా వరి కోతలు

7

ప్రాణం తీసిన గోతి

- ఇథనాల్ ట్యాంకర్, ఐరన్‌లోడు లారీ ఎదురెదురుగా వస్తూ ఢీ
- వ్యాపించిన మంటల్లో ట్యాంకర్ డ్రైవర్ సజీవదహనం
- హన్వాడ మండలం పిల్లిగుండు దగ్గర ఘటన

7

ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా.. నామినేషన్ల పర్వం షురూ

- తొలి రోజు దాఖలైన మొత్తం 548



ఖిల్లాఘణపురం సర్పంచ్ అభ్యర్థిగా నామినేషన్ అందజేస్తున్న పద్మమ్మ

మహబూబ్‌నగర్/నారాయణపేట/గద్వాల/వనపర్తి/నాగర్ కర్నూల్‌టౌన్, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి) : పంచాయతీ ఎన్నికలకు సంబంధించి ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా నామినేషన్లపర్వం ప్రారంభమైంది. గ్రామాల్లో వివిధ పార్టీల నాయకులు, అభ్యర్థులు, వారి మద్దతుదారులు, అనుచరుల సందడి మొదలయ్యింది. తొలివిడత ఎన్నికలకు గురువారం నామినేషన్ల దాఖలు ప్రారంభ మైంది. తొలి విడతలో ఉమ్మడి మహబూ బ్‌నగర్ జిల్లా వ్యాప్తంగా 548 గ్రామ పంచాయతీల్లో సర్పంచు స్థానాలకు 441, వార్డు మెంబర్ స్థానాలకు 176 నామినేషన్లు దాఖలయ్యాయి.

ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలో తొలిరోజు దాఖలైన నామినేషన్లు

జిల్లా	గ్రా.పం.	సర్పంచ్	వార్డు
1. మహబూబ్‌నగర్	137	108	71
2. నారాయణపేట	67	69	38
3. వనపర్తి	87	75	28
4. జోగుళాంబ	106	68	13
5. నాగర్‌కర్నూల్	151	121	26
మొత్తం	548	441	176

- మహబూబ్‌నగర్ జిల్లాలో తొలి విడత నవాబ్‌పేట, మహబూబ్‌నగర్ రూరల్, గండీడు, మహ్మదాబాద్, రాజాపూర్ మండలాల్లో (మిగతా 7లో..)

మరణించిన తరువాత కూడా సహాయ పడదాం

- మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ మల్లికార్జున్

6

అండర్-14 జాతీయ స్థాయి ఫుట్‌బాల్ క్రీడకు పి.రక్షిత్‌కుమార్

6



ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా చికెన్ సెంటర్స్ అసోసియేషన్

నేటి చికెన్ ధరలు

ఫామ్ లైవ్	: 110.00
హోల్ సేల్	: 122.00
డ్రెస్డ్	: 191.00
స్కిన్ లెస్	: 218.00

పారదర్శకతకు పెద్దపీట

- ప్రమాదాల నివారణపై ప్రత్యేక దృష్టి
- ఇసుక, రేషన్ బియ్యం అక్రమ రవాణాపై కొరడా
- ఆంధ్రజ్యోతి ఇంటర్వ్యూలో ఎస్పీ డాక్టర్ సంగ్రామ్‌సింగ్‌జీ పాటిల్



ఆంధ్రజ్యోతి ఇంటర్వ్యూ

ఎస్పీ డాక్టర్ సంగ్రామ్‌సింగ్‌జీ పాటిల్

నాగర్‌కర్నూల్, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలోని ప్రతీ పోలీస్‌స్టేషన్‌లో పారదర్శకతకు పెద్ద పీట వేస్తామని ఎస్పీగా డాక్టర్ సంగ్రామ్‌సింగ్‌జీ పాటిల్ స్పష్టం చేశారు. యువతను మత్తు పదార్థాలకు బానిస చేసి తప్పుదోవ పట్టించే వారిపై ఉక్కుపాదం మోపుతాం. పంచాయతీ ఎన్నికలను ప్రశాంతంగా నిర్వహించడం కోసం ప్రత్యేకంగా టాస్క్‌ఫోర్సు బృందాలను ఏర్పాటు చేశామని 'ఆంధ్రజ్యోతి'కి ఇచ్చిన ఇంటర్వ్యూలో ఆయన వెల్లడించారు.

మీ కుటుంబ నేపథ్యమేమిటి?

మహారాష్ట్రలోని షోలాపూర్ జిల్లా పండరీపూర్ మా స్వగ్రామం. మా నాన్న జీఎస్.పాటిల్, అమ్మా ఎంజీఎస్ పాటిల్. వృత్తిరీత్యా మా నాన్న డాక్టర్, మా చెల్లెళ్లు సుప్రియ న్యాయవాది, స్వప్నజ ఆస్ట్రాలర్, సోనాలీ డాక్టర్లుగా కొనసాగుతున్నారు. మా కుటుంబంలో నాతో సహా మొత్తం 18మంది డాక్టర్లు ఉన్నారు. నా భార్య వైష్ణవి ఎంటెక్ పూర్తి చేసి డీఆర్‌డీఏలో సైంటిస్టుగా పని చేస్తోంది. నాకు ఇద్దరు సంతానం. అణగలక్ష్మీ సెకండ్ క్లాస్ చదువుతోంది. కుమారుడు స్వయంభు ఎల్‌కేజీలో ఉన్నాడు.

వైద్య విద్య నుంచి పోలీస్ డిపార్ట్‌మెంట్‌కు రావడానికి గల కారణం..?

నాకు చిన్నప్పటి నుంచి పరిమితమైన స్థాయిలో ఉంటూ పని చేయడం కొంత అయిష్టంగానే ఉండేది. నేను డాక్టర్‌గా ఉన్నప్పటికీ కేవలం కొందరికీ మాత్రమే సేవలు అందిస్తున్నాననే అసంతృప్తి ఉండేది. ప్రజలకు సేవ చేయడానికి విస్తృతమైన ఒక వేదికను ఎంచుకోవాలనే తపన ఉండేది. ఈ కారణంగా సమాజానికి మేలు చేకూర్చే వృత్తి పోలీసులదని అర్థమైంది. ఈ క్రమంలో ఇండియన్ అడ్మినిస్ట్రేటివ్ సర్వీస్‌కు ప్రిపేర్ అయి 2015లో ఐపీఎస్‌గా ఎంపిక య్యాను.

ఐపీఎస్‌గా మీరు ఏ ప్రాంతాల్లో సేవలందించారు.?

పోలీస్ అధికారిగా నా ప్రస్థానం కరీంనగర్ గ్రేహౌండ్స్ అసాల్ట్ కమాండర్‌గా ప్రారంభమైంది. ఆ తర్వాత భద్రాచలంలో అడిషనల్ ఎస్పీగా ములుగు, భూపాలపల్లి జిల్లా సూపరింటెండెంట్ ఆఫ్ పోలీస్‌గా, ఆర్టీసీలో విజిలెన్స్ ఎస్పీగా ఆ తర్వాత మహబూబాద్ పోలీస్ సూపరింటెండెంట్‌గా సెంటర్ ఫర్‌గుడ్ గవర్నెన్స్, సీఐడీ పోలీస్ సూపరింటెండెంట్‌గా బాధ్యతలను నిర్వర్తించా.

ఎస్పీగా మీ ప్రాధాన్యతలు ఏమిటీ?

న్యాయం కోసం వచ్చే బాధితులకు వివక్ష లేకుండా న్యాయం జరగాలనేది నా అభిమతం. అందుకోసం ఎస్పీ కార్యాలయంతోపాటు ప్రతీ పోలీస్‌స్టేషన్‌లో పారదర్శకత పెంపొందించేలా కృషి చేస్తాను. మత సామరస్యం కాపాడేందుకు పోలీస్ శాఖ నుంచి శక్తి వంచన లేకుండా కృషి చేస్తాం.

మత్తు పదార్థాల నివారణకు ఎలాంటి చర్యలు తీసుకుంటారు..?

మత్తు పదార్థాలకు బానిసలు చేసి యువతను తప్పుదోవ పట్టించే శక్తులపై ఉక్కుపాదం మోపుతాం. నిందితులకు కొమ్ముకాసే ఏ రాజకీయ నాయకుడిని కూడా వదిలిపెట్టం. పిల్లల వ్యవహార శైలిపై కూడా తల్లిదండ్రులు దృష్టి సారించాల్సిన అవసరం ఉంది.

ఎన్నికలు ప్రశాంతంగా నిర్వహించేందుకు ఎలాంటి చర్యలు తీసుకుంటారు..?

జిల్లాలోని అన్ని వర్గాల ప్రజలు, రాజకీయ పక్షాలు సహకారంతో ప్రశాంతంగా నిర్వహిస్తాం. ఎన్నికల్లో అక్రమాలను నివారించేందుకు కల్వాల, దోమలపెంట, బిజినేపల్లి, వనపర్తి సరిహద్దు ప్రాంతాల్లో చెక్‌పోస్టులను ఏర్పాటు చేస్తున్నాం. మద్యం, డబ్బు పంపిణీని నియంత్రించేందుకు దాదాపు 40స్పెషల్ స్క్వాడ్‌లను ఏర్పాటు చేస్తున్నాం. బెల్టుషాపులపై కూడా కఠినమైన చర్యలు ఉంటాయి. నామినేషన్ ప్రక్రియ నుంచి పోలింగ్ ముగిసే వరకు ప్రతీ అంశాన్ని రికార్డు చేస్తాం. ఎన్నికల నిబంధనలు అతిక్రమిస్తే ఉపేక్షించబోము.

వ్యాపారానికి అడ్డొస్తున్నాడని..

- హత్యచేసి యాక్సిడెంట్‌గా చిత్రీకరణ



విలేకర్ల సమావేశంలో హత్యకు సంబంధించిన వివరాలను వెల్లడిస్తున్న గద్వాల ఎస్పీ

- మాజీ సర్పంచ్ చిన్న భీమరాయుడు హత్య కేసులో 10 మంది అరెస్ట్.. ఒకరి పరారీ
- సుపారీ గ్యాంగ్‌తో మర్డర్ చేయించినట్లు పోలీసుల నిర్ధారణ
- వివరాలను వెల్లడించిన ఎస్పీ శ్రీనివాసరావు

గద్వాల క్రైం, నవంబరు27(ఆంధ్రజ్యోతి): నందిన్నె మాజీ సర్పంచ్ హత్య కేసులో ఎట్టకేలకు నిందితులను అరెస్టు చేశారు. సుపారీ గ్యాంగ్‌కు హత్యకు సంబంధించి నగదు ఇచ్చేందుకు వచ్చిన వారిని బుధవారం ఎర్రవల్లి చౌరస్తా సమీపంలో అరెస్ట్ చేసి వారి నుంచి రూ. 8.50 లక్షల నగదు, 4 కార్లు, 1 బొలోరో వాహనం, 2 బైకులు, 11 సెల్‌ఫోన్లు, 13 సిమ్‌కార్డులను స్వాధీనం చేసుకున్నామని ఎస్పీ శ్రీనివాసరావు తెలిపారు. గురువారం గద్వాల పోలీస్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో హత్యకు సంబంధించిన పూర్తి వివరాలను ఎస్పీ వెల్లడించారు. ఈ నెల 21న సాయంత్రం మృతుడు నందిన్నె మాజీ సర్పంచ్ చిన్నభీమరాయుడు తన బైక్‌పై గద్వాలకు వచ్చి తిరిగి నందిన్నెకు వెళ్తున్నాడు. ఈ సమయంలో ధరూర్ దాటిన తర్వాత జాంపల్లి బస్టాప్ సమీపంలో ఒక బొలెరో వాహనంతో చిన్నభీమరాయుడు బైక్‌ను ఢీ కొట్టారు. ఈ ప్రమాదం లో చిన్నభీమరాయుడు అక్కడికక్కడే మృతి చెందారు. ఈ యాక్సిడెంట్‌పై అనుమానం ఉందని ఆయన సోదరుడు పెద్ద భీమరాయుడు ధరూర్ పోలీసులకు ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసుకొని దర్యాప్తు ప్రారంభించారు. ఈ దర్యాప్తులో నందిన్నె గ్రామానికి చెందిన మిల్లు వీరన్న పాతకక్షతోనే హత్య చేయించినట్లు వెల్లడైందన్నారు. ఎవరికీ అనుమానం రాకుండా రాయలసీమలోని కర్నూల్‌కు చెందిన ఈశ్వరయ్యగౌడు ద్వారా సుపారీ గ్యాంగ్‌తో రూ.25 లక్షలకు ఒప్పందం కుదుర్చుకొని కర్నూల్ జిల్లా పంచలింగాలకు చెందిన డ్రైవర్ తెలుగు మధుబాబు ద్వారా యాక్సిడెంట్ చేయించారు. చివరకు పోలీసులు డ్రైవర్‌ను అదుపులోకి తీసుకొని విచారించగా అసలు నిజాలు తెలిశాయని తెలిపారు. ఇందులో ప్రధాన సూత్రదారి మిల్లు వీరన్నతో పాటు కుర్వ సురేందర్(మిల్లు వీరన్న కుమారుడు), నందిన్నె గ్రామం, బోయ వీరన్న అలియాస్ గబ్బర్ వీరన్న(నందిన్నె), డ్రైవర్ తెలుగు మధుబాబు(పంచలింగాల), తెలుగు కృష్ణ (తాండ్రపాడు, కర్నూల్ జిల్లా), సంజీవులు(మదనపల్లి, గద్వాల మండలం), బైరి సుంకన్న (సి. బెళగల్, కర్నూల్ జిల్లా), బైరి కేశన్న (సి. బెళగల్, కర్నూల్ జిల్లా), ప్రభుస్వామి (నందిన్నె), హరిజన్ రాజేష్(నందిన్నె గ్రామం) వీరిని అరెస్ట్ చేశామని ఈశ్వరయ్య గౌడు పరారీలో ఉన్నట్లు ఎస్పీ తెలిపారు. నిందితులను కోర్టులో హాజరు పరిస్తే రిమాండ్‌కు తరలించాలని సూచించినట్లు తెలిపారు. సమావేశంలో అదనపు ఎస్పీ శంకర్, డీఎస్పీ మొగులయ్య, గద్వాల సీఐ శ్రీను, ఎస్ఐలు శ్రీహరి, కళ్యాణ్‌కుమార్, శ్రీకాంత్, కేటీ మల్లేశ్ తదితరులు ఉన్నారు.

బాల్యవివాహాలు చట్టరీత్యా నేరం



సమావేశంలో మాట్లాడుతున్న వనపర్తి కలెక్టర్ ఆదర్శ్ సురభి

వనపర్తి విద్యావిభాగం, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): వనపర్తి పట్టణంలోని గిరిజన సంక్షేమ బాలికల పాఠశాలలో రూరల్ డెవలప్‌మెంట్ సొసైటీ ఆధ్వర్యంలో గురువారం నిర్వహించిన 'బాల్ వివాహ ముక్త్ భారత్' కార్యక్రమానికి కలెక్టర్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ బాల్యవివాహాలను నిర్మూలించడం ప్రతీ పౌరుడి బాధ్యత అన్నారు. బాల్యవివాహాల నిరోధక చట్టం 2006 ప్రకారం 18 ఏళ్ల లోపు బాలికలకు పెళ్లి చేయడం నేరమన్నారు. బాల్య వివాహాల చట్టం ప్రకారం బాల్య వివాహాలను చేస్తే తల్లిదండ్రులపైనే కాకుండా వివాహానికి హాజరైన, ప్రోత్సహించిన వారు కూడా శిక్షార్హులని తెలిపారు. బాల్యవివాహాలకు సంబంధించి గత ఏడాది 36 మందిపై ఎఫ్ఐఆర్ నమోదు చేసినట్లు కలెక్టర్ తెలిపారు. స్టాప్ చైల్డ్ మ్యారేజ్ పేరుతో బాల్యవివాహాలపై చిన్నారులు వేసిన పెయింటింగ్ అందరినీ ఆకట్టుకున్నది. సమావేశంలో చిన్నమ్మ థామస్, డీఆర్డీవో ఉమాదేవి, జిల్లా సంక్షేమ అధికారి సుధారాణి, డీఎంహెచ్‌వో సాయినాథ్‌రెడ్డి, చైల్డ్ ప్రొటెక్షన్ ఆఫీసర్ రాంబాబు, తహసీల్దార్ రమేశ్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఈ - కుకింగ్

- కొండారెడ్డిపల్లిలో ప్రయోగాత్మకంగా అమలు
- సోలార్ ఆధారిత గ్రామంలో ఇండక్షన్ స్టవ్‌ల వినియోగం
- తగ్గనున్న గ్యాస్ సిలిండర్ల వాడకం

6

వేంకటేశ్వరుడి దర్శనం.. కోటి జన్మల పుణ్యఫలం

- సోదెవాదిరాజ మఠాధిపతి విశ్వవల్లభ తీర్థులు

7

అంతర్జాతీయ పోటీలకు సిర్సవాడ విద్యార్థులు

6

ఈ - కుకింగ్

● కొండారెడ్డిపల్లిలో ప్రయోగాత్మకంగా అమలు

» సోలార్ ఆధారిత గ్రామంలో ఇండక్షన్ స్టవ్‌ల వినియోగం

» తగ్గనున్న గ్యాస్ సిలిండర్ల వాడకం



ఇండక్షన్ స్టవ్‌ను వినియోగిస్తున్న గృహిణి



కొండారెడ్డిపల్లిలో ఓ ఇంటిపై ఏర్పాటు చేసిన సోలార్ పలకలు

వంగూరు, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): సౌర విద్యుత్‌తో కొండారెడ్డిపల్లికి కొత్తకళ సంతరించుకొంది. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి స్వగ్రామం నాగర్‌కర్నూల్ జిల్లా వంగూరు మండలం కొండారెడ్డిపల్లిలో సౌర వెలుగులు విరజిమ్ముతున్నాయి. పూర్తిగా సౌర విద్యుత్ నడుస్తున్న కొండారెడ్డిపల్లి తెలంగాణలోనే తొలి సోలార్ గ్రామంగా రికార్డులకెక్కింది. గ్రామంలో ప్రతీ ఇంటిపై పూర్తి ఉచితంగా సౌర విద్యుత్ కోసం రెండు నెలల కిందట ఏర్పాట్లు పూర్తి చేశారు. వంటకు ఉపయోగపడే ఇండక్షన్ స్టవ్, కుక్కర్లను పంపిణీ చేశారు. దేశవ్యాప్తంగా ఈ-కుకింగ్ లేదా క్లీన్ కుకింగ్ పేరుతో ప్రభుత్వం ప్రత్యేక పథకం అమలు చేసింది. కరెంట్‌తో పని చేసే ఇండక్షన్ స్టవ్‌ల వినియోగంతో గ్యాస్ సిలిండర్ల వాడకం బాగా తగ్గించవచ్చనేది ఈ పథకం ప్రధాన ఉద్దేశం. గ్రామంలో ఇంటిపై సౌర విద్యుత్‌ను ఏర్పాటు చేసుకున్న వారు ఉచిత కరెంట్‌తో లబ్ధిపొందడంతో పాటు ఇండక్షన్ స్టవ్‌లను వినియోగిస్తూ విద్యుత్ బిల్లు పెరుగకుండా ఆదా అవుతుంది.

గ్రామంలో ప్రయోగాత్మకంగా అమలు

గత రెండు నెలల కిందట కొండారెడ్డిపల్లిలో 576 మంది మహిళలకు స్టవ్‌లు, కుక్కర్లను ఉచితంగా పంపిణీ చేశారు. 1300 వాట్ల సామర్థ్యంతో పని చేసే ఎలక్ట్రిక్ ఇండక్షన్ స్టవ్‌తో పాటు దానిపై వంట చేసుకునేందుకు 5 లీటర్ల సామర్థ్యం గల కుక్కర్లను రెడ్కో కొని గ్రామంలోని ప్రతీ ఇంటి మహిళకు అందజేసింది. ప్రతీ ఇంటిపై 3 కిలోవాట్ల స్థాపిత సామర్థ్యంతో సౌర విద్యుత్‌కు ఏర్పాట్లు చేసినందున నెలకు సుమారు 360 యూనిట్ల కరెంటు ఉత్పత్తి అవుతుందని అంచనా.

ప్రజలకు అవగాహన కల్పించాం

గ్రామంలో 576 మంది మహిళలకు స్టవ్‌లు, కుక్కర్లను పంపిణీ చేశాం. అత్యధిక ఇళ్లలో కరెంట్ వినియోగం 200 నుంచి 300 యూనిట్లు లోపే ఉంది. ఇండక్షన్ స్టవ్‌తో వంట చేసుకున్నా ఇంకా కరెంటు మిగులుతుందని దీనిపై ప్రజలకు అవగాహన కల్పించాం.



\- మనోహర్‌రెడ్డి, రెడ్కో ఉమ్మడి జిల్లా మేనేజర్

ఈ-కుకింగ్ వల్ల చాలా ఉపయోగం

మా గ్రామంలో సోలార్ విద్యుత్ ఏర్పాటుతో మాకు చాలా ఉపయోగంగా ఉంది. మా ఇంటి పైన సోలార్ పలకను ఏర్పాటు చేశారు. మాకు స్టవ్‌లను, కుక్కర్లను ఉచితంగా పంపిణీ చేశారు. రెండు నెలలుగా స్టవ్‌ను వాడుతున్నాం. దీనిపై వంట చాలా మంచిగా అవుతున్నది. దీని గురించి ఇదివరకే అధికారులు మాకు అవగాహన కల్పించారు. దీని వల్ల గ్యాస్ వాడకం తగ్గి మేలు జరుగుతుంది. మా గ్రామాన్ని అభివృద్ధి చేస్తున్న సీఎం రేవంత్‌రెడ్డికి రుణపడి ఉంటాం.

\- సిత్రాల కవిత, కొండారెడ్డిపల్లి

భూమి లెక్క.. ఇక పక్కా

» శాటిలైట్ సాయంతో కచ్చితమైన కొలతలు

» డిజిటల్ సర్వేకు పైలట్ ప్రాజెక్టుగా 33 గ్రామాలు

వివాదాలకు తావుండదిక..



మద్దూర్ మండలం ఖాజీపూర్‌లో భూభారతి పోర్టల్‌ను ప్రారంభిస్తున్న మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి(ఫైల్)

మద్దూర్, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి) : భూవివాదాలను పరిష్కరించేందుకు ప్రభుత్వం ఓ కొత్త విధానాన్ని అమలు చేయనున్నది. గత ప్రభుత్వ హయాంలో అమలు చేసిన ధరణితో భూ సమస్యలు మరింత అధికమయ్యాయి. దీంతో ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం కొత్త చట్టాన్ని తీసుకొచ్చింది. ధరణి స్థానంలో భూభారతి పేరున కొత్తపోర్టల్‌ను ఏర్పాటు చేసింది. దాని ద్వారా భూములకు సంబంధించిన వివాదాలు, సరిహద్దు తగదాలను పరిష్కరించేందుకు పకడ్బందీ చర్యలకు శ్రీకారం చుట్టింది.

సర్వేనంబర్ ఆధారంగా...

నిర్దిష్ట కాలంలో భూములను రీసర్వే చేయకపోవడంతో సరిహద్దులు, సర్వే రికార్డుల సమస్యలు తలెత్తి రైతుల మధ్య వివాదాలకు కారణమవుతోంది. ఇలాంటి సమస్యలను శాశ్వతంగా పరిష్కరించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటోంది. పట్టాదారు పాస్‌బుక్కు, సర్వే నంబర్ ఆధారంగా భూమిని డిజిటల్ విధానంలో రీసర్వే చేసి సరిహద్దులను నిర్దేశించనున్నది. ఆ భూమి విస్తీర్ణం, పట్టాదారు తదితర వివరాలను స్పష్టంగా పేర్కొననున్నది. భవిష్యత్‌లో వివాదాలు తలెత్తకుండా ఉండేందుకు శాటిలైట్ ద్వారా కచ్చితమైన కొలతలు వేయనున్నది.

రైతులందరికీ భూధార్ నెంబర్

గ్రామంలోని భూముల సర్వే నంబర్ల ఆధారంగా రైతుల కమతాలు, సరిహద్దులను ఖరారు చేసి ఆన్‌లైన్ ద్వారా మ్యాపులను రూపొందిస్తారు. ఒక రైతు పేరుతో ఉన్న అన్ని సర్వే నెంబర్లను ఒకే రికార్డులో చేర్చి ప్రత్యేక భూధార్ నంబర్‌ను కేటాయిస్తారు.

పైలట్ ప్రాజెక్టుకు ఎంపికైన గ్రామాలు

రీసర్వే పైలట్ ప్రాజెక్టు అమలుకు ప్రభుత్వం నారాయణపేట జిల్లాలో 33 గ్రామాలను ఎంపిక చేసింది. మద్దూర్ మండల కేంద్రంతో పాటు కోస్గి మండలంలోని కొత్తపల్లి, చంద్రవంచ, మిశ్రిప, తోగపూర్, కోస్గి మండలాలున్నాయి. నారాయణపేట మండలంలోని ఎక్లాస్‌పూర్, శెర్నపల్లి, పామిరెడ్డిపల్లి, కొడకుండ, కొండారెడ్డిపల్లి, దామరగిద్ద మండలంలోని అశన్‌పల్లి, అయ్యవారి పల్లి, అన్నసాగర్, ఉడుముల్ గిద్దలను ఎంపిక చేశారు. ధన్వాడ మండల కేంద్రంతో పాటు, కిష్టాపూర్, గున్ముకుల, ఊట్కూరు మండలంలో పుల్మామిడి, నర్వ మండలంలోని నర్వ, లంకాల, యమ్మీ, జంగిరెడ్డిపల్లి, ఉందేకోడ్, కోడ్మూర్, ఎల్లంపల్లినాగిరెడ్డిపల్లి, రాయకోడ్, అప్పంపల్లి గ్రామాలున్నాయి. గుండుమాల్ మండలంలోని బలభద్రాయపల్లి, గుండుమాల్, కొత్తపల్లి మండల కేంద్రంతో పాటు భూనీడ్ గ్రామాలను పైలట్ ప్రాజెక్టు అమలుకు ఎంపిక చేశారు. దీనికి సంబంధించిన నోటిఫికేషన్ ప్రభుత్వం జారీ చేసింది. అలాగే సర్వేయర్లకు శిక్షణ పూర్తి చేసింది. ఈ నెల చివరి వారం లేదా వచ్చేనెలలో డిజిటల్ సర్వేను చేపట్టనున్నారు.

భూ సమస్యలకు శాశ్వత పరిష్కారం

భూ సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపాలనే లక్ష్యంతో ప్రభుత్వం డిజిటల్ సర్వే చేపట్టనున్నది. అందుకు 87 మంది సర్వేయర్లకు శిక్షణ ఇచ్చారు. వారి ద్వారా శాస్త్రీయ పద్ధతిలో భూరీసర్వే చేపట్టనున్నారు. పైలట్ గ్రామాల్లో సర్వే పూర్తయ్యాక, దశల వారీగా అన్ని గ్రామాల్లో ఈ కార్యక్రమం చేపట్టనున్నారు.

\- గిరిధర్, సర్వే అధికారి, నారాయణపేట

సీఎం పర్యటన భద్రతా ఏర్పాట్లు పరిశీలన



సీఎం పర్యటన భద్రతా ఏర్పాట్లను పరిశీలిస్తున్న అదనపు ఎస్పీ రియాజ్

మక్తల్, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి) : ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి డిసెంబరు 1 మక్తల్‌కు వస్తున్న సందర్భంగా గురువారం అదనపు ఎస్పీ ఎండీ రియాజ్, డీఎస్పీ నల్లపు లింగయ్య, అదనపు కలెక్టర్ శ్రీనులు సమావేశ వేదిక, హెలిప్యాడ్, పార్కింగ్, ప్రజా రాకపోకల మార్గాలు సందర్శించారు. ఈ సందర్భంగా సంబంధిత శాఖల అధికారులతో సమన్వయం చేసుకొని ప్రజల భద్రత, ట్రాఫిక్ నియంత్రణ, అత్యవసర సేవలు, తీసుకోవాల్సిన చర్యలు, తదితర వాటిపై సూచనలు చేశారు. అదనపు బందోబస్తు, రూట్‌మ్యాప్, పార్కింగ్ లైన్లు, హెలిప్యాడ్ వద్ద సెక్యూరిటీ తదితర అంశాలపై చర్చించారు. అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు.

ఫార్మసీ విద్యార్థులు

గ్రామీణులకు అవగాహన కల్పించాలి

» పీయూ పీజీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ మధుసూదన్ రెడ్డి



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న పీయూ పీజీ కళాశాల ప్రిన్సిపాల్ మధుసూదన్ రెడ్డి

పాలమూరు యూనివర్సిటీ, నవంబర్ 27 (ఆంధ్రజ్యోతి): ఫార్మసీ విద్యార్థులు గ్రామంలోని ప్రజలకు యాంటీ బయోటిక్ మందులు ఏవిధంగా ఉపయోగించాలో అవగాహన కలిగించాలని పీయూ పీజీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ మధుసూదన్ రెడ్డి అన్నారు. గురువారం పీయూలోని ఫార్మసీ ఆడిటోరియంలో నిర్వహించినటువంటి ఫార్మసీ వారోత్సవాలలో చివరి రోజు హాజరై మాట్లాడారు. ఫార్మసీ ప్రిన్సిపాల్ డాక్టర్ రవికాంత్, ఫార్మసీ కళాశాల విభాగధిపతి డాక్టర్ ప్రభాకర్ రెడ్డి, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

బెల్ట్ షాపులపై మెరుపు దాడి

» 60 లీటర్ల లిక్కరు స్వాధీనం



పాలెంలో బెల్ట్ షాపు వద్ద అక్రమంగా అమ్ముతున్న మద్యాన్ని, నిందితులను అదుపులోకి తీసుకుంటున్న ఎస్పీ డాక్టర్ సంగ్రామ్ సింగ్‌జీ పాటిల్

బిజినేపల్లి, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి) : నాగర్‌కర్నూల్ జిల్లా బిజినేపల్లి మండలంలోని పాలెం గ్రామంలో స్థానిక సంస్థల ఎన్నికల కోడ్ ప్రారంభమైంది. అక్రమంగా మద్యం విక్రయిస్తున్న బెల్ట్ షాపులపై గురువారం రాత్రి నాగర్‌కర్నూల్ ఎస్పీ సంగ్రామ్ సింగ్‌జీ పాటిల్ మెరుపు దాడి చేశారు. ముగ్గురు నిందితుల నుంచి 60 లీటర్ల లిక్కరును స్వాధీనం చేసుకున్నారు. కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ కే.శ్రీనివాస్ తెలిపారు.

జిల్లాలో ఎన్నికల కోడ్ నియమావళి అతిక్రమించి చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడితే చట్టపరంగా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ప్రజాస్వామ్య పద్ధతిలో ఎన్నికలు సామరస్యంగా జరిగేందుకు ప్రతీ ఒక్కరు బాధ్యత వ్యవహరించాలని తెలిపారు.

మద్యం పట్టివేత... కేసు నమోదు

ఖిల్లాఘణపురం, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి) : వనపర్తి జిల్లా ఖిల్లాఘణపురం మండలంలోని షాపూర్ గ్రామ శివారు చెట్ల పొదల్లో అక్రమంగా నిల్వ చేసిన మద్యంను గురువారం పట్టుకున్నట్లు ఎస్ఐ వెంకటేష్ తెలిపారు. మండలంలోని ఆముదంబండ తండాకు చెందిన రాత్లావత్ బిచ్చ అక్రమంగా మద్యంను షాపూర్ శివారులో నిల్వ చేసి అధిక ధరకు విక్రయించేందుకు తరలిస్తున్నాడన్నారు. పట్టుబడిన మద్యం 32.6 లీటర్లు కాగా సుమారు దాని విలువ రూ.20,900 ఉన్నట్లు ఎస్ఐ తెలిపారు. పట్టుబడిన మద్యంను స్వాధీనం చేసుకుని కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ వెంకటేష్ తెలిపారు.

మరణించిన తరువాత కూడా సహాయపడదాం

» మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ మల్లికార్జున్



చీర్ల రామచందర్ మృతదేహాన్ని మెడికల్ కళాశాలకు అప్పగిస్తున్న కుటుంబ సభ్యులు

వనపర్తి వైద్యవిభాగం, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): అవయవ దానం, శరీర దానంతో మరణించిన తరువాత కూడా సహాయపడుదామని మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ మల్లికార్జున్ అన్నారు. గురువారం జిల్లా కేంద్రంలోని మెడికల్ కళాశాలకు చీర్ల రామచందర్ (81) అనే విశ్రాంత రైల్వే ఉద్యోగి మృతదేహాన్ని కుటుంబ సభ్యులు మెడికల్ కళాశాలకు దానం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.... మరణం అనంతరం మెడికల్ కళాశాలకు మృతదేహం దానం చేయడం ద్వారా విద్యార్థుల వైద్య విద్య అధ్యయనంలో పరిశోధనలో ఉపయోగకరంగా ఉంటుందన్నారు. చీర్ల రామచందర్ కుటుంబ సభ్యులు మాట్లాడుతూ... ఇతరులకు సహాయపడాలన్న సామాజిక స్పృహతో తమ తండ్రి బతికుండగానే తన శరీరాన్ని మెడికల్ కళాశాలకు దానం చేసేందుకు అంగీకారం తెలిపారని అన్నారు. తమ తండ్రి చివరి కోరిక మేరకే మృతదేహాన్ని మెడికల్ కళాశాలకు అప్పగించామన్నారు. చీర్ల రామచందర్ కుటుంబ సభ్యులు, అనాటమీ హెచ్‌వోడీ డాక్టర్ హరి కృష్ణ, ప్రొఫెసర్ ఆనంద్ డేవిడ్, కళాశాల విద్యార్థులు పాల్గొన్నారు.

ఎన్నికలు పారదర్శకంగా నిర్వహించాలి

» ఎన్నికల ప్రవర్తన నియమావళి పరిశీలకుడు మల్లయ్య బట్టు



పచ్చ జెండా ఊపి వాహనం ప్రారంభిస్తున్న మల్లయ్య బట్టు, కలెక్టర్, ఎస్పీ, వ్యయ పరిశీలకులు

వనపర్తి రాజీవ్‌చౌరస్తా, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో పంచాయతీ ఎన్నికలు పారదర్శకంగా, సజావుగా నిర్వహించేందుకు అందరూ సహకరించాలని ఎన్నికల ప్రవర్తనా నియమావళి పరిశీలకుడు మల్లయ్య బట్టు కోరారు. రాష్ట్ర ఎన్నికల కమిషన్ మల్లయ్య బట్టును జిల్లా సాధారణ పరిశీలకులుగా నియమించింది. ఎన్నికల వ్యయ పరిశీలకులుగా శ్రీనివాసులు నాగర్‌కర్నూల్ ఆడిట్ ఆఫీసర్‌ను నియమించింది. వారు గురువారం సాయంత్రం కలెక్టరేట్ సమావేశ మందిరంలో జిల్లా ఎన్నికల అథారిటీ ఆదర్శ్ సురభి ఆధ్వర్యంలో నోడల్ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సాధారణ పరిశీలకుడు మాట్లాడుతూ... ఎలాంటి ప్రలోభాలకు తావు లేకుండా పారదర్శకంగా ఎన్నికలు నిర్వహించేందుకు అధికారులు, సిబ్బంది కృషి చేయాలని సూచించారు. వ్యయ పరిశీలకుడు శ్రీనివాసులు మాట్లాడారు. అభ్యర్థులు ప్రచారానికి చేసే ప్రతి పైసా షాడో టీమ్ ద్వారా లెక్కింపు చేయనున్నట్లు తెలిపారు. ఖర్చుకు సంబంధించిన వివరాలు ఏ రోజుకు ఆ రోజు ఏఈవోలకు పంపించాలని సూచించారు. 50 వేల కంటే ఎక్కువ మొత్తంలో డబ్బులు, లిక్కర్ పట్టుబడితే సీజర్ టీమ్‌కు అప్పగించాలని సూచించారు. ఎస్పీ సునీత మాట్లాడారు.

అనంతరం కలెక్టర్ ఆదర్శ్ సురభి, ఎన్నికల పరిశీలకులు, జిల్లా ఎస్పీ ఎఫ్ ఎస్ టీ, ఎస్ఎస్‌టీ వాహనాలకు జెండా ఊపి ప్రారంభించారు.

రైతుల గోస ఎవరికీ పట్టడం లేదు

» బీసీ పొలిటికల్ జేఏసీ రాష్ట్ర చైర్మన్ రాచాల యుగంధర్ గౌడ్



ధాన్యం రాశులను పరిశీలిస్తున్న బీసీ పొలిటికల్ జేఏసీ రాష్ట్ర చైర్మన్ డాక్టర్ రాచాల యుగంధర్ గౌడ్

వనపర్తి రూరల్, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి) : పండించిన పంట నెల రోజులకు పైగా కొనుగోలు కేంద్రాల్లోనే మగ్గుతున్నా ఎవరికీ పట్టడం లేదని బీసీ పొలిటికల్ జేఏసీ రాష్ట్ర చైర్మన్ రాచాల యుగంధర్ గౌడ్ ఆవేదన వ్యక్తం చేశారు. గురువారం వనపర్తి మండలం అంకూరు గ్రామంలో వరి కొనుగోలు కేంద్రాన్ని ఆయన పరిశీలించారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడు తూ... జిల్లాలో అధికారులు ప్రజాప్రతినిధులు క్షేత్రస్థాయిలో పర్యటించి రైతులు పడుతున్న ఇబ్బందులను కళ్లు తెరిచి చూడాలన్నారు. నెల రోజులకు పైగా రైతులు పడిగాపులు కాస్తూ తీవ్ర సమస్యలతో అక్కడే ఉండాల్సి వస్తుందన్నారు. ప్రభుత్వ నిబంధనలను బేఖాతరు చేస్తూ లావు రకం వడ్లను దించుకోకుండా రైతులను ఇబ్బందులు పెడుతున్న వారిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. సివిల్ సప్లయ్ అధికారుల నిర్లక్ష్యం కారణంగానే రైతులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. రైతుల దీనస్థితి ఏ పార్టీ నాయకుడికి పట్టడం లేదన్నారు. తరుగు పేరుతో రైతులను నిలువు దోపిడీ చేస్తుంటే పట్టించుకునే నాథుడే లేకపోవడం దురదృష్టకరమన్నారు. ఇకనైనా కలెక్టర్ కలగజేసుకుని రైతులు పడుతున్న గోసను వెంటనే తీర్చాలని, లేదంటే బీసీ పొలిటికల్ జేఏసీ ఆధ్వర్యంలో రైతులతో కలిసి పెద్ద ఎత్తున ఉద్యమం చేస్తామని హెచ్చరించారు. బీసీ పొలిటికల్ జేఏసీ వనపర్తి అధ్యక్షుడు దేవర శివ నాయకులు వీవీ గౌడ్, అంజన్న యాదవ్, ధర్మేంద్ర సాగర్, రాఘవేందర్ గౌడ్, అస్కని రమేష్, రామన్ గౌడ్, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

జాతీయ స్థాయి

వెయిట్ లిఫ్టింగ్ పోటీలకు ఎంపిక



వెయిట్ లిఫ్టింగ్ పోటీలకు ఎంపికైన విద్యార్థిని అర్చన

నర్వ, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి) : నారాయణపేట జిల్లా నర్వ మండలంలోని రాయికోడ్ గ్రామానికి చెందిన విద్యార్థిని అర్చన జాతీయ స్థాయి వెయిట్ లిఫ్టింగ్ పోటీలకు ఎంపికైనట్లు విశ్రాంత పీఈటీ గోపాలం తెలిపారు. రాయికోడ్ గ్రామానికి చెందిన దివంగత వెంకటయ్య, అంజమ్మ దంపతుల కుమార్తె అర్చనను 2018లో విశ్రాంత పీఈటీ గోపాలం చేరదీసి వేసవి క్రీడా శిక్షణ శిబిరంలో మెరుగైన శిక్షణ అందించారు. దీంతో అర్చన 9 క్రీడాంశాల్లో మెరుగైన శిక్షణ పొంది హకీంపేట క్రీడా పాఠశాలకు ఎంపికైంది.

అక్కడ 4వ తరగతిలో ప్రవేశం పొంది వెయిట్ లిఫ్టింగ్ కోచ్ సంపత్‌కుమార్ పర్యవేక్షణలో 2022 నుంచి 2024 వరకు రాష్ట్ర స్థాయి వెయిట్ లిఫ్టింగ్ పోటీల్లో 48 కేజీలు, 53 కేజీలు, 58 కేజీల విభాగంలో ప్రతిభ చాటి ప్రశంసాపత్రాన్ని పొందిందన్నారు. ప్రస్తుతం హకీంపేట క్రీడా పాఠశాలలో 10వ తరగతి చదువుతూ ఈనెల 2వ మహబూబాబాద్ జిల్లా కేంద్రంలో రాష్ట్రస్థాయి జూనియర్ వెయిట్ లిఫ్టింగ్ పోటీలో 63 కేజీలు ఎత్తి జాతీయ స్థాయికి ఎంపికైందని, ఈనెల 20 నుంచి 30 వరకు అరుణాచల్ ప్రదేశ్ రాజధాని ఈటానగర్‌లో జరిగే జాతీయ స్థాయి వెయిట్ లిఫ్టింగ్ పోటీలకు వెళ్లినట్లు గోపాలం పేర్కొన్నారు. ఈ విద్యార్థిని అక్క అనూష సైతం గోపాలం దగ్గరే శిక్షణ పొంది సైక్లింగ్ పోటీల్లో గోల్డ్ మెడల్ సాధించింది. క్రీడా రంగంలో ఇద్దరు అక్కా చెల్లెల్లు రాణిస్తూ బంగారు పతకాలను సాధించడంపై రాయికోడ్ గ్రామస్థులు, నర్వ మండల క్రీడాభిమానులు వారిని అభినందించారు.

విద్యార్థులు ఉన్నతంగా ఎదగాలి

» జాతీయ స్థాయిలో అయిజ విద్యార్థి ప్రతిభ



ప్రతిభ కనబరిచిన విద్యార్థిని అభినందిస్తున్న మాస్టర్లు

అయిజ, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు ఉన్నతంగా ఎదగాలని మాస్టర్లు అడ్వకేట్ మధుకుమార్, షెక్షావలిఆచారిలు ఆకాంక్షించారు. నవంబరు 25వ తేదీ వరకు ఉత్తర ప్రదేశ్ రాష్ట్రంలో జరిగిన అండర్-41 కిలోల విభాగంలో శివశంకర్ అత్యుత్తమ ప్రతిభ కనబరిచి వెండి పతకం సాధించారు. జోగుళాంబ గద్వాల జిల్లా నుంచి దాదాపు 200 మంది పాల్గొన్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా శివశంకర్‌ను శాలువాతో సన్మానించి అభినందించారు. భవిష్యత్‌లో జాతీయ, అంతర్జాతీయస్థాయిలో మరెన్నో పతకాలు సాధించి ఉన్నవారికి, కన్నవారికి, గురువులకు మంచి పేరు తీసుకురావాలని ఆశీర్వదించారు. అనంతరం బెల్టు ఎగ్జామ్స్‌లో ప్రమోషన్ పొందిన విద్యార్థులకు సర్టిఫికెట్స్ అందచేశారు. సుధాకర్ పాల్గొన్నారు.

అండర్-14 జాతీయ స్థాయి

ఫుట్‌బాల్ క్రీడకు పి.రిక్షిత్‌కుమార్



రిక్షిత్‌కుమార్‌ను అభినందిస్తున్న కలెక్టర్ బదావత్ సంతోష్

కల్వకుర్తి, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి) : మధ్యప్రదేశ్‌లో వచ్చే నెల డిసెంబరు 1 నుంచి 6వరకు జరగబోయే నేషనల్ ఫుట్‌బాల్ చాంపియన్‌షిప్‌కు కల్వకుర్తి విస్డం స్కూల్‌కు చెందిన 8వ తరగతి చదువుతున్న విద్యార్థి పి.రిక్షిత్‌కుమార్ ఎంపికయ్యారు. గురువారం రోజున పి.రిక్షిత్‌కుమార్‌ను నాగర్‌కర్నూల్ కలెక్టర్ బదావత్ సంతోష్ అభినందించారు.

ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ కల్వ కుర్తి నుంచి జాతీయ స్థాయిలో ఎంపిక కావడం జిల్లాకు గర్వించదగ్గ విషయమని, రిక్షిత్‌కుమార్ ప్రపంచ స్థాయిలో రాణించాలన్నారు. డీవైఎస్‌వో సీతారాం, కోచ్ వెంకట్రాములు, ఫుట్‌బాల్ క్రీడాకారిణి పి.అక్షర తదితరులు పాల్గొన్నారు.

అంతర్జాతీయ పోటీలకు

సిర్సవాడ విద్యార్థులు





సంధ్య, వర్షిణి

తాడూరు, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి) : ఆన్‌లైన్‌లో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా బాల సాహిత్య భేరీ అంతర్జాతీయ శతాధిక బాల రచయితల సమ్మేళనం ఈ నెల 30న నిర్వహిస్తున్నట్లు తెలుగు ఉపాధ్యాయుడు సత్యనారాయణ తెలియజేశారు. ఆదివారం ఉదయం 9 గంటల నుంచి రాత్రి 10గంటల వరకు ఈ కార్యక్రమం కొనసాగుతుందన్నారు. కార్యక్రమానికి మొత్తం 111మంది విద్యార్థులను ఎంపిక చేయగా అందులో సిర్సవాడ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల నుంచి సంధ్య, వర్షిణీలు ఎంపికయ్యారు. దీంతో పాఠశాల జీహెచ్‌ఎం రమేష్‌తోపాటు ఉపాధ్యాయులు విద్యార్థుల యొక్క తల్లిదండ్రులు పాఠశాల ఉపాధ్యాయ బృందాన్ని అభినందించారు.

ఆరుగురి బైండోవర్

మానవపాడు, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): స్థానిక సంస్థల ఎన్నికల సందర్భంగా గురువారం పోలీసులు ఆరుగురిని బైండోవర్ చేయించినట్లు తహసీల్దార్ జోషి శ్రీనివాస్ శర్మ తెలిపారు. బైండోవర్ అయిన వారిని సొంత పూచీకత్తు లక్ష నగదు పత్రాలపై సంతకాలు చేయించుకున్నారు. గ్రామాల్లో ఎలాంటి ఘటనలు చేయకూడదని, నిబంధనలకు విరుద్ధంగా కార్యక్రమాలు చేస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. బైండోవర్ అయినవారిలో మానవపాడు, అమరవాయి, కొర్విపాడు గ్రామాలకు చెందిన వారని ఆయన తెలిపారు.

క్రైం కార్నర్

శ్రీశైలం రహదారిపై ట్రాక్టర్ బోల్తా

మన్ననూర్, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి) : నాగర్‌కర్నూల్ జిల్లా, అమ్రాబాద్ మండలం లోని మన్ననూరు సమీ పంలో శ్రీశైలం - హైదరాబాద్ రహదారిపై ట్రాక్టర్ అదుపు తప్పి బోల్తాపడింది. వెంకటేశ్వర్లబావి గ్రామానికి చెందిన బొల్లు వెంకటయ్య గృహనిర్మాణ సామగ్రిని తీసుకొచ్చేందుకు ట్రాక్టర్‌లో హాజీపూర్ వైపు వెళ్తున్నాడు. నిరంజన్ షావలీ దర్గా వద్ద ఘాటు రోడ్డుపై బ్రేక్ ఫెయిల్ కావడంతో ట్రాక్టర్ అదుపుతప్పి బోల్తా పడింది. వెంటనే అప్రమత్తమైన డ్రైవర్ వెంకటయ్య పాటు మరో వ్యక్తి కిందికి దూకేయడంతో ప్రాణాపాయం తప్పింది.

కారు, స్కూటీ ఢీ

» ఒకరి మృతి, మరొకరికి తీవ్ర గాయాలు

మిడ్జిల్, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి) : కారు, స్కూటీ ఢీకొని ఒకరు మృతి చెందారు. మరొకరు తీవ్రంగా గాయపడ్డారు. మహబూబ్‌నగర్ జిల్లా, మిడ్జిల్ మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయం వద్ద గురువారం రాత్రి ఈ సంఘటన జరిగింది. రంగారెడ్డి జిల్లా, తలకొండపల్లి మండలంలోని చంద్రధన గ్రామానికి చెందిన ఇషాక్, రహెమాన్‌లు స్కూటీపై నాగర్‌కర్నూల్ వైపు వెళ్తున్నారు. జడ్చర్ల మండలం గంగాపూరం గ్రామానికి చెందిన బాలస్వామిగౌడ్, యాదమ్మలు బోయిన్‌పల్లి గ్రామంలో శుభకార్యానికి హాజరై కారులో తిరిగి వస్తున్నారు. 167వ జాతీయరహదారిపై మిడ్జిల్ తహసీల్దార్ కార్యాలయం సమీపంలో ఎదురెదురుగా వస్తూ ఢీకొన్నాయి. దీంతో ఇషాక్, రహెమాన్‌లకు తీవ్ర గాయాలయ్యాయి. కారులో ఉన్న యాదమ్మ స్వల్పంగా గాయపడింది. విషయం తెలుసుకున్న స్థానికులు, పోలీసులు క్షతగాత్రులను 108 అంబులెన్స్‌లో జడ్చర్ల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. వారిలో రహెమాన్ మార్గం మధ్యలో మృతి చెందాడు.

గుట్కా ప్యాకెట్ల పట్టివేత

మక్తల్, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): నారాయణపేట జిల్లా మక్తల్ పట్టణంలోని ఓ దుకాణంలో నిషేధిత గుట్కా ప్యాకెట్లు పట్టుకొని కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ భాగ్యలక్ష్మీరెడ్డి తెలిపారు. పట్టణానికి చెందిన ఓ వ్యక్తి తన దుకాణంలో గుట్కా ప్యాకెట్లు విక్రయిస్తున్నాడనే సమాచారం మేరకు టాస్క్‌ఫోర్స్ పోలీసులు దాడులు నిర్వహించారన్నారు. దాడుల్లో రూ.31,470 విలువగల నిషేధిత గుట్కా ప్యాకెట్లు స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

ఇసుక ట్రాక్టర్ పట్టివేత

మరికల్, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): నారాయణపేట జిల్లా మరికల్ మండలంలోని ఎక్లాస్‌పూర్ మన్నెవాగు నుంచి ఇసుకను తరలిస్తున్న ట్రాక్టర్‌ను గురువారం తెల్లవారుజామున పోలీసులు పట్టుకున్నారు. ట్రాక్టర్‌ను పోలీస్‌స్టేషన్‌కు తరలించి, వాహన యజమాని కల్వల రవిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ రాము తెలిపారు.

ఆంగ్ల ఉపన్యాస పోటీల్లో జిల్లాస్థాయికి ఎంపిక



జిల్లా స్థాయికి ఎంపికైన విద్యార్థులను అభినందిస్తున్న ఎంఈవో

మల్దకల్, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): జోగుళాంబ గద్వాల జిల్లా మల్దకల్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో గురువారం మండల స్థాయి ఆంగ్లంలో ఉపన్యాస పోటీలను నిర్వహించారు. ఇంగ్లీష్ లాంగ్వేజీ ఉపాధ్యాయుల ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ పోటీలలో జూనియర్ విభాగంలో ఎల్కూరు ఉన్నత పాఠశాల విద్యార్థి సమీరాబేగం ప్రథమ స్థానం సాధించగా, జూనియర్ ఒలంపియాడ్ విభాగంలో నాని ప్రథమ స్థానం సాధించి జిల్లా స్థాయికి ఎంపికయ్యారు.

అలాగే సీనియర్ ఒలంపియాడ్ విభాగంలో మల్దకల్‌కు చెందిన ప్రథమ స్థానం గ్రేసీ సాధించగా, ఉపన్యాస విభాగంలో అమరవాయి విద్యార్థి మహేశ్ ప్రథమ స్థానం పొంది జిల్లా స్థాయికి ఎంపికయ్యారు. విద్యార్థులకు మండల విద్యాశాఖాధికారి సురేశ్ అభినందించి ప్రశంసాపత్రాలను అందజేశారు. ఆంగ్ల ఉపాధ్యాయులు సుమలత, వెంకట్రాములు, ప్రసన్న కుమార్, రమణమ్మ, జయమ్మ తదితరులు పాల్గొన్నారు.

ఆయకట్టు పరిధిలో జోరందుకున్న వరి కోతలు

అయిజ, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): జూరాల, ఆర్డీఎస్, నెట్టెంపాడు ఆయకట్టు పరిధిలో వరి కోతలు జోరందుకున్నాయి. ఈ ఖరీఫ్ నందు సాగు చేసిన వరి పంట కోతకు సిద్ధంగా ఉంది. గత ఖరీఫ్ నుంచి కాంగ్రెస్ ప్రభుత్వం వరికి మద్దతు ధరతో పాటు క్వింటాలుకు అదనంగా బోనస్ కింద రూ. 500 చెల్లిస్తూ ధాన్యాన్ని కొనుగోలు చేసింది. కొనుగోలు కేంద్రాలు ఇప్పటికే ప్రారంభమయ్యాయి. జూరాల, ఆర్డీఎస్, నెట్టెంపాడు, బావులు, బోర్లు, చెరువులు, కుంటలు, రిజర్వాయర్ల కింద వరి పంట సాగుచేశారు. వరి కోతలు ప్రారంభమయ్యాయి. రైతులు కల్లాలు చేస్తున్నారు. జోగుళాంబ గద్వాల జిల్లాలో బోర్లు, బావులు, చెరువులు, కుంటలు డ్యామ్‌లు, ఆర్డీఎస్, జూరాల కింద మొత్తంగా 38,743 హెక్టార్లలో వరి సాగుచేశారు. అధికారుల అంచనా ప్రకారం... 2,59,776 మెట్రిక్ టన్నుల సన్న రకం, 3,120 మెట్రిక్ టన్నుల దొడ్డు రకం దిగుబడిరావచ్చనే అంచనాలో అధికారులు ఉన్నారు. మొత్తంగా 2,62,397 మెట్రిక్ టన్నుల దిగుబడి వస్తుందన్న అంచనాలో ఉన్నారు. ప్రస్తుతం కోతలు ఊపందుకున్నాయి. వరి కోత యంత్రం ద్వారా కోతలు చేస్తే ఎకరానికి రూ. 2,200 నుంచి రూ. 2,800 వరకు రైతులు చెల్లిస్తున్నారు. యంత్రం కోత కోసి ధాన్యాన్ని శుభ్రం చేసి రాశులుగా, సంచుల్లోను పోస్తోంది. రైతులు ధాన్యం తేమగా ఉంటే కల్లాల దగ్గరే ఆరబెడుతున్నారు. తాలు, చెత్త, చెదారాన్ని తూర్పార పడుతూ వేరు చేసే పనులలో రైతులు ఉన్నారు. కోతలు పూర్తి చేసి ధాన్యాన్ని సిద్ధం చేసుకున్న రైతులు కొనుగోలు కేంద్రాలకు తరలిస్తున్నారు.

ఘనంగా సదర్ ఉత్సవాలు

» దున్నపోతులతో భారీ ఊరేగింపు



సదర్ ఉత్సవాల్లో పాల్గొన్న కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి కుంభం శివకుమార్ రెడ్డి

నారాయణపేట న్యూటౌన్, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి) : నారాయణపేట పట్టణంలో గురువారం రాత్రి యాదవ సంఘం ఆధ్వర్యంలో సదర్ ఉత్సవాల ను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా యాదవులు దున్నపోతులతో భారీ ఊరేగింపు నిర్వహించారు. బారంబావి నుంచి ప్రారంభమైన ఊరేగింపు పాతగంజ్ వరకు కొనసాగింది. ఊరేగింపునకు కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్ చార్జి కుంభం శివకుమార్‌రెడ్డి, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు ఎస్ఆర్‌రెడ్డి, బీజేపీ రాష్ట్ర నాయకుడు నాగురావు నామాజీ, జిల్లా అధ్యక్షుడు సత్యయాదవ్ హాజరయ్యారు. యాదవ సంఘం నాయకులు బాలప్ప యాదవ్ సత్యయాదవ్, రఘువీర్‌యాదవ్ పాల్గొన్నారు.

అభివృద్ధి పనులకు బ్రేక్

» అమలులోకి ఎన్నికల ప్రవర్తనా నియమావళి
» పార్టీల జెండాలపై ముసుగులు, ఫెక్సీల తొలగింపు



సింగారం చౌరస్తాలో పార్టీ ఫ్లెక్సీలను తొలగిస్తున్న పంచాయతీ సిబ్బంది



సింగారంలో గోడలపై పార్టీ గుర్తులు కన్పించకుండా సున్నాలు వేస్తున్న పంచాయతీ సిబ్బంది

నారాయణపేట, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి) : గ్రామ పంచాయతీ ఎన్నికల షెడ్యూల్ విడుదల కావడంతో ఎన్నికల ప్రవర్తనా నియమావళి అమలులోకి వచ్చింది. దీంతో ప్రభుత్వం చేపట్టే అభివృద్ధి పనులకు బ్రేక్ పడనున్నది. నారాయణపేట జిల్లాలోని వ్యాప్తంగా 13 మండలాల పరిధిలో అధికార యంత్రాంగం, సిబ్బందితో పార్టీ జెండాలపై ముసుగులు వేయిస్తోంది. ఫ్లెక్సీలను తొలగిస్తోంది. గోడలపై పార్టీల గుర్తులు, రాతలపై సున్నాలు వేయిస్తున్నారు. సీఎం రేవంత్‌రెడ్డి సొంత నియోజకవర్గం కొడంగల్ పరిధిలో తొలి విడుతలో కోస్గి, మద్దూర్, గుండుమాల్, కొత్తపల్లి మండలాల్లో ఎన్నికలు నిర్వహించనున్నారు. నామినేషన్ల ప్రక్రియ గురువారం ప్రారంభం కానున్నది. 29న శనివారం సాయంత్రం ఐదు గంటల వరకు కొనసాగనున్నది. 30న నామినేషన్ల పరిశీలన, డిసెంబరు 1న అప్పీళ్లు, 2న పరిశీలన, 3న మధ్యాహ్నం 3 గంటల వరకు నమినేషన్ల ఉపసంహరణ ఉంటాయి. 11న ఉదయం ఏడు గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు ఓటింగ్ ప్రక్రియ కొనసాగుతుంది. మధ్యాహ్నం 2 గంటల నుంచి ఓట్ల లెక్కింపు ప్రారంభం కానున్నది. సాయంత్రానికల్లా ఫలితాలు వెల్లడిస్తారు. రెండో విడతలో నారాయణపేట నియోజకవర్గంలోని దామరగిద్ద, నారాయణపేట, ధన్వాడ, మరికల్ మండలాలు, మూడో విడతలో మక్తల్ నియోజకవర్గంలోని ఊట్కూర్, మక్తల్, నర్వ, మాగనూర్, కృష్ణ మండలాల్లో ఎన్నికలు జరుగనున్నాయి.

సర్పంచ్ మీకు.. ఉప సర్పంచ్ మాకు!

» కాంగ్రెస్‌లో కొత్త, పాత నాయకుల మధ్య మంతనాలు
» వివాదాలు తలెత్తకుండా ఒప్పందాలు

మహబూబ్‌నగర్, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి) : స్థానిక ఎన్నికల పుణ్యమా అని అధికార కాంగ్రెస్ పార్టీలో గ్రూపు తగాదాలు బయటపడుతున్నాయి. ముందు నుంచి పార్టీలో పని చేస్తున్న క్యాడర్‌కు ఎన్నికల ముందు, ఎన్నికల తరువాత పార్టీలోకి వచ్చిన నాయకుల మధ్య పొసగడం లేదు. పలు చోట్ల నాయకులు సర్దిచెబుతున్నా పెద్దగా ఫలితం ఉండటం లేదు. చాలా చోట్ల సర్పంచ్ స్థానానికి పోటీ చేసే అవకాశం తమ వర్గానికంటే.. కాదు కాదు తమ వర్గానికే ఇవ్వాలంటూ ఎమ్మెల్యేలపై ఒత్తిడి తీసుకొస్తున్నారు. దీంతో పలుచోట్ల మధ్యే మార్గంగా సర్పంచ్ మీకు.. ఉపసర్పంచ్ మాకు అంటూ ఒప్పందాలు కుదుర్చుకుంటున్నారు. లేదంటే సర్పంచ్ పదవి మీకు.. వచ్చే ఎంపీటీసీ మాకు అని అంగీకారాలు చేసుకుంటున్నారు. రిజర్వేషన్‌ల మార్పుతో పోటీ చేసే అవకాశం కోల్పోయిన ఆశావహులు ఉపసర్పంచ్ స్థానంతో సరిపెట్టుకునేందుకు యత్నిస్తున్నారు. గతంతో పోల్చితే ఉపసర్పంచ్ పదవికి డిమాండ్ పెరిగింది. సర్పంచ్‌తో కలిసి ఉపసర్పంచ్‌కు చెక్ పవర్ ఉండటమే అందుకు కారణం. ప్రతీ బిల్లుకు సర్పంచుతో పాటు, ఉపసర్పంచ్ సంతకం కచ్చితంగా అవసరం కావడంతో ఈ పదవికి డిమాండ్ ఏర్పడింది. ఉపసర్పంచ్‌కు పోటీ చేసే వారు కూడా ఖర్చులో సగం భరించాలని ముందుగానే మాట్లాడుకుంటున్నారు. సర్పంచ్ పదవి మహిళలకు రిజర్వ్ అయిన చోట కూడా పోటాపోటీ నెలకొన్నది.

గులాబీ, తెలుపు..

» బ్యాలెట్ పత్రాలకు వేర్వేరు రంగులు
» సర్పంచ్ స్థానానికి 'పింక్', వార్డు స్థానానికి 'వైట్'

నారాయణపేట, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి) : మూడు విడుదతల్లో నిర్వహించనున్న గ్రామ పంచాయతీ ఎన్నికల్లో సర్పంచ్, వార్డు మెంబర్ స్థానాలకు బ్యాలెట్ పత్రాలు వేర్వేరు రంగుల్లో ఉంటాయి. సర్పంచ్ స్థానానికి పోటీ చేసే అభ్యర్థులకు సంబందించిన బ్యాలెట్ పత్రం గులాబీ (పింక్) రంగులో ఉంటుంది. వార్డు స్థానానికి పోటీ చేసే అభ్యర్థుల బ్యాలెట్ పత్రాలు తెలుపు (వైట్) రంగులో ఉంటాయి.



తేడా వస్తే.. తిరస్కారం

నామినేషన్ వేసేందుకు సిద్ధం అవుతున్నారా?

» ఈ విషయాలను గుర్తుంచుకోవాలి
» ఈ పత్రాలను సరిచూసుకోవాలి

మహబూబ్‌నగర్, నవంబరు 27 (ఆంధజ్యోతి) : గ్రామ పంచాయతీ ఎన్నికల్లో పోటీ చేసేందుకు సిద్ధం అవుతున్నారా? నామినేషన్లు వేయాలనుకుంటున్నారా? అయితే ఈ విషయాలను గుర్తుంచుకోండి.. సమర్పించాల్సిన పత్రాలను సరి చేసుకోండి.. ఎందుకంటే ఏమాత్రం తేడా వచ్చినా మీ నామినేషన్‌ను తిరస్కరిస్తారు..

- పోటీదారులు 21 సంవత్సరాల వయస్సు నిండి ఉండాలి.
- అభ్యర్థి, ప్రతిపాదకుడు సంతకం చేసిన నామినేషన్ పత్రాలను ఉదయం 10:30 గంటల నుంచి సాయంత్రం 5 గంట లలోపు సమర్పించాలి.
- ప్రతిపాదకుడు ఖచ్చితంగా సంబంధిత వార్డు ఓటరు జాబితాలో ఓటరుగా నమోదై ఉండాలి.
- అభ్యర్థి, ప్రతిపాదకుడు ఇంటి పన్ను పూర్తిగా చెల్లించి, గ్రామపంచాయతీ నుంచి తీసుకున్న నోడ్యూ సర్టిఫికెట్‌ను సమర్పించాలి.
- సర్పంచ్ అభ్యర్థికి డిపాజిట్ రుసుము రూ2 వేలు, వార్డు సభ్యుడికి రూ.500 చెల్లించాల్సి ఉంటుంది. రిజర్వ్‌డ్ కేటగిరి అభ్యర్థులు సర్పంచ్‌కు రూ.1000, వార్డు సభ్యులకు రూ. 250 డిపాజిట్ రుసుము చెల్లించాలి.
- ఎస్సీ, ఎస్టీ, బీసీ అభ్యర్థులు కుల ధ్రువీకరణ పత్రం సమర్పించడం తప్పనిసరి. లేదంటే నామినేషన్ ఫారం-3లో డిప్యూటీ తహసీల్దార్‌తో సంతకం చేయించి ఇవ్వాలి.
- ఇద్దరు సాక్షులు స్వీయ ధ్రువీకరణ పత్రంలో అన్ని గడులు పూరించి సమర్పించాలి.
- రిటర్నింగ్ అధికారి సమక్షంలో ఎన్నికల ఖర్చు ఖాతా నిర్వహిస్తానని డిక్లరేషన్‌పై సంతకం చేసి ఇవ్వాల్సి ఉంటుంది.
- అభ్యర్థి తన గుర్తింపునకు రెండు ఫొటోలను సమర్పించాలి
- స్క్రూట్నీ రోజు నిర్ణీత సమయానికి రిటర్నింగ్ ఆఫీసర్ ఎదుట హాజరుకావాలి
- ఆధార్, ఓటరుకార్డు, బ్యాంక్ పాస్‌బుక్కు జిరాక్స్ పత్రాలు సమర్పించాలి

(5వ పేజీ తరువాయి..)

ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా.. నామినేషన్ల పర్వం ప్రారంభం

ఎన్నికలు జరుగనున్నాయి. మొత్తం 137 గ్రామ పంచాయతీలకు గాను తొలి రోజు సర్పంచు స్థానాలకు 108, వార్డు స్థానాలకు 71 నామినేషన్లు దాఖలయ్యాయి.

● నారాయణపేట జిల్లాలో తొలి విడతలో కోస్గి, గుండుమాల్, కొత్తపల్లి, మద్దూరు మండలాల్లోని 67 గ్రామ పంచాయతీలకు ఎన్నికలు జరుగనున్నాయి. తొలి రోజు సర్పంచ్ స్థానాలకు 69 నామినేషన్లు, వార్డు మెంబర్లకు 38 నామినేషన్లు దాఖలయ్యాయి.

● జోగుళాంబ గద్వాల జిల్లాలో మొదట విడత గద్వాల, ధరూర్, గట్టు, కేటీదొడ్డి మండలాల్లోని 106 గ్రామ పంచాయతీలు, 974 వార్డు మెంబర్ స్థానాలకు ఎన్నికలు జరుగనున్నాయి. తొలి రోజు నాలుగు మండలాల నుంచి గ్రామ సర్పంచు స్థానాలకు 68 నామినేషన్లు, వార్డు మెంబర్ స్థానాలకు 13 నామినేషన్లు ధాఖలు అయ్యాయి.

● వనపర్తి జిల్లాలో తొలి విడత ఘణపూర్, రేవల్లి, గోపాల్‌పేట, ఏదుల, పెద్దమందడి మండలాల్లోని 87 గ్రామాలు, 780 వార్డులకు ఎన్నికలు జరుగనున్నాయి. తొలి రోజు సర్పంచ్ పదవికి 75, వార్డు స్థానాలకు 28 నామినేషన్లు దాఖలయ్యాయి.

● నాగర్‌కర్నూల్ జిల్లాలోని కల్వకుర్తి, ఊర్కొండ, వెల్దండ, వంగూరు, తాడూరు, తెల్కపల్లి మండలాల పరిధిలోని 151 గ్రామపంచాయతీలకు ఎన్నికలు జరుగుతున్నాయి. మొదటి రోజు 121 సర్పంచు నామినేషన్లు, వార్డులకు 26 నామినేషన్లు దాఖలయ్యాయి.



కోస్గి మండలంలోని ముశ్రీఫాలో సర్పంచ్ స్థానానికి నామినేషన్ వేస్తున్న అభ్యర్థి

మహబూబ్‌నగర్ జిల్లా

మండలం	గ్రా.పం.	సర్పంచ్	వార్డు
1. నవాబ్‌పేట	42	21	18
2. మ.రూరల్	24	35	32
3. గండీడు	26	28	1
4. మహ్మదాబాద్	22	13	8
5. రాజాపూర్	23	11	12
మొత్తం	137	108	71

నాగర్‌కర్నూల్ జిల్లా

మండలం	గ్రా.పం.	సర్పంచ్	వార్డు
1. కల్వకుర్తి	24	19	11
2. ఊర్కొండ	16	11	-
3. వెల్దండ	32	19	6
4. వంగూరు	27	24	2
5. తాడూరు	24	23	5
6. తెల్కపల్లి	28	25	2
మొత్తం	151	121	26

నారాయణపేట జిల్లా

మండలం	గ్రా.పం.	సర్పంచ్	వార్డు
1. కోస్గి	14	19	25
2. గుండుమాల్	13	08	01
3. కొత్తపల్లి	16	26	8
4. మద్దూరు	24	16	04
మొత్తం	67	69	38

జోగుళాంబ గద్వాల జిల్లా

మండలం	గ్రా.పం.	సర్పంచ్	వార్డు
1. గద్వాల	28	28	10
2. ధరూరు	28	12	-
3. గట్టు	27	22	03
4. కేటీదొడ్డి	23	6	-
మొత్తం	106	68	13

వనపర్తి జిల్లా

మండలం	గ్రా.పం.	సర్పంచ్	వార్డు
1. ఘణపూర్	29	28	4
2. రేవల్లి	9	12	8
3. గోపాల్‌పేట	15	13	10
4. ఏదుల	11	6	3
5. పెద్దమందడి	23	16	3
మొత్తం	87	75	28

ప్రాణం తీసిన గోతి

» ఇథనాల్ ట్యాంకర్, ఐరన్‌లోడు లారీ ఎదురెదురుగా ఢీ
» వ్యాపించిన మంటల్లో ట్యాంకర్ డ్రైవర్ సజీవదహనం
» హన్వాడ మండలం పిల్లిగుండు దగ్గర ఘటన



సజీవ దహనమైన ట్యాంకర్ డ్రైవర్ నిరంజనప్ప

హన్వాడ, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి) : జాతీయ రహదారులపై పడిన గోతులే ప్రమాదాలకు కారణం అవుతున్నాయి. ఇటీవల రంగారెడ్డి జిల్లాలో జరిగిన బస్సు, లారీ ప్రమాదానికి రోడ్డుపై పడిన గోతి కారణమైంది. ఆ ఘటనలో 30 మంది మృతి చెందారు. ఆ ప్రమాదం మరిచిగానే మహబూబ్‌నగర్ జిల్లా హన్వాడ మండలంలో బుధవారం అర్ధరాత్రి అగ్నిప్రమాదం జరిగింది. రోడ్డుపై గల గోతిని తప్పించబోయిన ఇథనాల్ అయిల్ ట్యాంకర్ ఐరన్‌లోడు లారీని ఢీకొట్టింది. ఈ ఘటనలో ట్యాంకర్ డ్రైవర్ నిరంజనప్ప (36) సజీవదహనం అయ్యాడు. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం బుధవారం అర్ధరాత్రి తాండూర్ జాతీయ రహదారి 167పై గల హన్వాడ మండలం పిల్లిగుండు, పల్లెమోని కాలనీ మధ్యలో పుణె నుంచి చెన్నై వెళుతున్న ఇథనాల్ ట్యాంకర్ రోడ్డుపై గల గుంతను తప్పించబోయి చించోళి నుంచి బెంగళూరుకు ఐరన్‌లోడుతో వెళుతున్న లారీని ఎదురుగా ఢీకొన్నది. పెద్ద ఎత్తున మంటలు ఎగసిపడ్డాయి. దాదాపు నాలుగు గంటల పాటు మంటలు చల్లారలేదు. మూడు ఫైరింజన్ల సహాయంతో మంటలు ఆర్పగా అప్పటికే ట్యాంకర్ డ్రైవర్ మంటలకు దహనమై ముద్దయి చనిపోయాడు. కర్ణాటక రాష్ట్రంలోని కాల్బుర్గి జిల్లా ఉడుదల్ల గ్రామానికి చెందిన ట్యాంకర్ డ్రైవర్ నిరంజనప్ప మంటలు చేలరేగిన సమయంలో తప్పించుకునే ప్రయత్నంలో ట్యాంకర్ కింద పడి సజీవ దహనం అయ్యాడు. జిల్లా ఎస్పీ జానకి ఘటనా స్థలానికి చేరుకొని సహాయక చర్యలను పర్యవేక్షించారు. లారీ డ్రైవర్ లవకుశ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

ఆ గోతే ప్రమాదానికి కారణం

చించోళి పాలమూరు 167 జాతీయ రహదారి పనులు పల్లెమోని కాలనీ వరకు పూర్తిచేశారు. అయితే పని ఆగిన చోట రోడ్డుపై గోతులు పడ్డాయి. ఆ గోతులను గమనించని వాహన చోదకులు వేగంగా వెళ్లి గోతిలో పడుతుండటంతో ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి. ఈ ప్రమాదం కూడా ఆ గోతుల వల్లే జరిగింది.

గోతుల మూలంగా ప్రమాదం జరిగింది



రోడ్డుపై పడిన గోతులను గమనించని ఇథనాల్ ట్యాంకర్ డ్రైవర్ నిరంజనప్ప వేగంగా వచ్చాడని, ట్యాంకర్ గోతిలో పడటంతో ఎదురుగా వస్తున్న తన లారీపైకి వచ్చి ఢీకొట్టాడని ఐరన్ లోడు లారీ డ్రైవర్ లవకుశ తెలిపారు. ట్యాంకర్ నుంచి తప్పించుకునేలోపే ఢీకొట్టడంతో మంటలు చెలరేగాయన్నారు. తాను లారీ లోపలే ఇరుక్కున్నానని, ప్రమాద స్థలం పక్కనే ఉన్న గ్రామానికి చెందిన కొందరు స్థానికులు లారీ అద్దాలు పగులగొట్టి తనను బయటకు తీశార ని లారీ డ్రైవర్ తెలిపారు.

- లవకుశ, లారీ డ్రైవర్

మహిళ అదృశ్యం

తిమ్మాజిపేట, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి) : తిమ్మాజిపేట మండల పరిధిలోని మారేపల్లి గ్రామానికి చెందిన మెట్ట యాదమ్మ(70) అదృశ్యమైంది. ఎస్ ఐ హరిప్రసాద్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. యాదమ్మ ఈనెల 23న ఇంటి నుంచి వెళ్లి తిరిగి రాలేదు. కుటుంబ సభ్యులు చుట్టుపక్కల, బంధువుల ఇళ్లలో వెతికినా ఫలితం లేకపోయింది. దీంతో ఆమె కుమారుడు శ్రీనివాసులు ఫిర్యాదు ఈ మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

వేంకటేశ్వర దర్శనం.. కోటి జన్మల పుణ్యఫలం

» సోదెవాదిరాజ మఠాధిపతి విశ్వవల్లభ తీర్థులు



పల్లకీసేవలో పాల్గొన్న భక్తులు, అర్చకులు

మల్దకల్, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి) : స్వయంభువు వేంకటేశ్వర స్వామిని దర్శించుకోవడం కోటి జన్మల పుణ్యఫలం అని మధ్వాచార మూలమహాసంస్థానం విష్ణుతీర్థర పరంపర సోదెవాదిరాజ మఠాధిపతి శ్రీవిశ్వవల్లభ తీర్థులు ప్రవచించారు. జోగుళాంబ గద్వాల జిల్లా, మల్దకల్ మండల కేంద్రంలోని ఆదిశిలా క్షేత్రంలో లక్ష్మీ వేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. అందులో భాగంగా గురువారం విశ్వవల్లభ తీర్థులు క్షేత్రానికి స్వాములు, శిష్యుల సమేతంగా వచ్చారు. వారికి ఆలయ చైర్మన్ ప్రహ్లాదరావు, కార్యనిర్వహణాధికారి సత్యచంద్రారెడ్డి పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. ఆలయంలో ప్రత్యేక పూజల అనంతరం పీఠాధిపతి అనుగ్రహ ప్రవచనం చేస్తూ ఆదిశిలాక్షేత్రం అపర తిరుపతిగా విరాజిల్లుతోందన్నారు. ఉత్సవాల్లో భాగంగా ఉదయం స్వామి, అమ్మవార్లకు పంచామృతాభిషే కంతో పాటు, విశేష పూజలు చేశారు. ఉత్సవ మూర్తులను పల్లకిలో ఆశీనులను గావించి పురవీధులలో ఊరేగించారు. ఈ సందర్భంగా పురజనులు స్వామిని దర్శించుకొని మొక్కులు తీర్చుకున్నారు.

మహిళా ఓటర్లదే పైచేయి

● ఓటరు జాబితాలో ముందంజలో మహిళా ఓటర్లు ● జిల్లా వ్యాప్తంగా పురుష ఓటర్లు 22,761, మహిళలు 23,219

అయిజ, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): ఆకాశంలో సగం నిన్నటి మాట.. నేడు అన్నింట్లోనూ ముందుంటున్నారు మహిళలు. ఈ మధ్యనే గ్రామపంచాయతీలకు సంబంధించి స్థానిక సంస్థల(సర్పంచు), జడ్పీటీసీ, ఎంపీటీసీ ఓటరు జాబితాను అధికారులు ప్రకటించారు. జిల్లా వ్యాప్తంగా అందులో మహిళా ఓటర్లు ముందంజలో ఉన్నారు. ఒక మండలంలో కాదు.. ఏకంగా జోగుళాంబ గద్వాల జిల్లాలోని 13 గ్రామపంచాయతీల పరిధిలో ఓటరు జాబితా పరిశీలిస్తే పురుషుల కంటే స్త్రీలే అధికంగా ఉన్నారు. ఒక్క మల్దకల్ మండలంలో మాత్రమే పురుషులు ఆధిక్యంలో ఉన్నారు. మిగతా 12 మండలాల్లో మహిళా ఓటర్లదే ఆధిక్యం.

అయిజ మండలంలో 28 గ్రామ పంచాయతీలు ఉన్నాయి. అందులో 22,761 పురుషులు, 23,219 మంది స్త్రీలు ఉన్నారు. వడ్డేపల్లి మండలంలో 10 గ్రామ పంచాయతీలు ఉండగా 8,342 మంది పురుషులు, 8,443 మంది స్త్రీలు ఉన్నారు. రాజోళి మండలంలో 11 గ్రామ పంచాయతీలలో 14,005 మంది పురుషులు, 14,270 స్త్రీలు ఉన్నారు. మానవపాడు మండలంలో 17 గ్రామపంచాయతీల్లో 12,622 మంది పురుషులు, 13,224 మంది స్త్రీలు ఉన్నారు.

ఇటిక్యాలలో 14 గ్రామ పంచాయతీల్లో 9,382 మంది పురుషులు, 9,586 మంది స్త్రీలు ఉన్నారు. ఉండవల్లిలో 15 గ్రామపంచాయతీల్లో 11,069 మంది పురుషులు, 11,539 మంది స్త్రీలు ఉన్నారు. అలంపూర్‌లో 14 గ్రామ పంచాయతీలలో 8,582 మంది పురుషులు, 8,793 మంది స్త్రీలు, మల్దకల్‌లో 25 గ్రామపంచాయతీలకు గాను 21,349 మంది పురుషులు, 21,212 మంది స్త్రీలు, గట్టులో 27 గ్రామ పంచాయతీలకు గాను 23,294 మంది పురుషులు, 24,266 మంది స్త్రీలు ఉన్నారు. గద్వాలలో 28 గ్రామపంచాయతీలకు గాను 17,565 మంది పురుషులు, 18,224 మంది స్త్రీలు ఉన్నారు.

అలాగే కేటీదొడ్డి మండలంలో 23 గ్రామపంచాయతీలకు గాను 14,106 మంది పురుషులు, 14,308 మంది స్త్రీలు ఉన్నారు. ధరూర్ నందు 26 గ్రామ పంచాయతీలకు 19,015 మంది పురుషులు, 19,893 మంది స్త్రీలు ఉన్నారు. ఎర్రవల్లి నందు 15 గ్రామ పంచాయతీల్లో 11,535 మంది పురుషులు, 11,810 మంది స్త్రీలు ఉన్నారు. జిల్లాలోని మొత్తం 13 మండలాల్లో 12 మండలాల్లో మహిళా ఓటర్లు ఆధిక్యంలో ఉన్నారు. ఒక్క మల్దకల్ మండలంలో (137 మంది) మాత్రమే పురుషులు అధికంగా ఉన్నారు. దీన్ని బట్టి మహిళా ఓటర్లు మొగ్గు చూపిన వైపే గెలుపు తథ్యం అన్నది అవగతం అవుతున్నది.

ప్రారంభమైన మొదటి దశ నామినేషన్ల పర్వం



చాగదోణలో తమ మద్దతుదారుడితో సర్పంచ్ స్థానానికి నామినేషన్ వేయిస్తున్న బీజేపీ జిల్లా అధ్యక్షుడు రామాంజనేయులు

గట్టు/ధరూరు, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): మొదటి దశ సర్పంచ్ ఎన్నికల కోసం గురువారం నామినేషన్ల స్వీకరణ ప్రక్రియ ప్రారంభమైంది. మండలంలో మొత్తం 27 గ్రామ పంచాయతీలకు సంబంధించి 8 కేంద్రాల్లో నామినేషన్ల స్వీకరణకు కేంద్రాలను ఏర్పాటు చేశారు. మిట్టదొడ్డి గ్రామ పంచాయతీ సర్పంచ్ పదవికి -2, ఆలూరు-2, అంతంపల్లి-2, బల్గెర-2, చాగదోణ గ్రామ పంచాయతీ సర్పంచ్‌కి -4, చమన్‌ఖాన్‌దొడ్డి-1, గంగిమాన్‌దొడ్డి-1, గట్టు-1, ఇందువాసి-1, మాచర్ల-2, రాయపురం-2, వాయిలకుంట తాండ -1, యల్లందొడ్డి-1 చొప్పున మొత్తం 22 మంది అభ్యర్థులు సర్పంచ్ స్థానానికి నామినేషన్లు వేశారని, వార్డు సభ్యులకు మూడు నామినేషన్లు సమర్పించారని రిటర్నింగ్ అధికారులు తెలిపారు. చాగదోణ గ్రామ పంచాయతీకి సంబంధించి బీజేపీ జిల్లా అధ్యక్షుడు రామాంజనేయులు, మాజీ అధ్యక్షుడు రామచంద్రారెడ్డి గ్రామానికి చేరుకుని పార్టీ మద్దతుదారునితో నామినేషన్ వేయించారు.

● ధరూర్‌లో 12 నామినేషన్లు

ధరూరు మండలంలో ఏర్పాటు చేసిన ఏడు నామినేషన్ కేంద్రాల్లో మొదటి రోజు గురువారం 12 నామినేషన్లు దాఖలయ్యాయని ఇన్‌చార్జి ఎంపీడీవో కృష్ణమూర్తి తెలిపారు. ద్యాగదొడ్డి నామినేషన్ కేంద్రం నుంచి నాగర్‌దొడ్డికి ఐదు నామినేషన్లు, ఉప్పేరు కేంద్రంలో ఉప్పేరు గ్రామానికి సంబంధించి మూడు నామినేషన్లు, గార్లపాడు గ్రామానికి సంబంధించి నాలుగు దాఖలయ్యాయని తెలిపారు.

● కేటిదొడ్డిలో : కేటిదొడ్డి మండల పరిధిలోని ఏడు నామినేషన్ కేంద్రాల్లో మొదటిరోజు గురువారం ఆరు నామినేషన్లు దాఖలయ్యాయని అధికారులు తెలిపారు. కేటిదొడ్డి గ్రామం నుంచి మూడు, మైలగడ్డ నుంచి రెండు, గంగన్‌పల్లె నుంచి ఒకటి, మొత్తం ఆరు నామినేషన్లు దాఖలైనట్లు అధికారులు తెలిపారు.

నేరాల నియంత్రణకు కృషి చేయాలి

● కేసుల విచారణలో జాప్యం చేస్తే చర్యలు తప్పవు

● నేర సమీక్షా సమావేశంలో ఎస్పీ శ్రీనివాసరావు



సమావేశంలో మాట్లాడుతున్న ఎస్పీ శ్రీనివాసరావు

గద్వాల క్రైం, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): నేరాల నియంత్రణపై దృష్టి సారించి ప్రజలకు మెరుగైన సేవలు అందించాలని ఎస్పీ శ్రీనివాసరావు అన్నారు. గురువారం జిల్లా కేంద్రంలోని జిల్లా పోలీసు కార్యాలయంలో నిర్వహించిన నేరసమీక్షా సమావేశంలో ఎస్పీ మాట్లాడుతూ ప్రతీ కేసులో క్వాలిటీ ఆఫ్ ఇన్వెస్టిగేషన్ ద్వారా నేరస్థులకు శిక్ష పడేలా చేసి బాధితులకు న్యాయం చేకూర్చాలన్నారు. కేసుల విచారణలో జాప్యం చేస్తే సహించేదిలేదని హెచ్చరించారు. పెట్రోలింగ్, బ్లూకోల్ట్ వాహనాలలో అధికారులు, సిబ్బంది ఎల్లప్పుడూ రోడ్లపై తిరుగుతూ ప్రజలకు అందుబాటులో ఉంటూ విసబుల్ పోలీసింగ్ విధులు నిర్వహించాలన్నారు. జిల్లాలోని ప్రతి పోలీస్ స్టేషన్ పరిధిలోని కొత్త సీసీకెమెరాలను ఏర్పాటు చేసి నిరంతరం పనిచేసేలా మానిటర్ చేయాలని సూచించారు. సైబర్ నేరాల బారిన పడకుండా ప్రజలను ఎప్పటికప్పుడు అప్రమత్తం చేయాలన్నారు. రోడ్డు ప్రమాదాల నివారణకు చర్యలు తీసుకోవాలని చెప్పారు. సమావేశంలో అదనపు ఎస్పీ కె.శంకర్, డీఎస్పీ మొగులయ్య, గద్వాల, అలంపూర్, శాంతినగర్ సీఐలు టి. శ్రీను, రవిబాబు, టాటాబాబు ఉన్నారు.

● కట్టుదిట్టంగా భద్రత

గ్రామ పంచాయతీ ఎన్నికలు పకడ్బందీగా ప్రశాంత వాతావరణంలో నిర్వహించేందుకు పోలీస్ అధికారులు చర్యలు తీసుకోవాలని ఎస్పీ శ్రీనివాసరావు ఆదేశించారు. గురువారం సాయంత్రం జిల్లా పోలీస్ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎన్నికల నిబంధనల ప్రకారం భద్రత కట్టుదిట్టంగా అమలు చేయాలని ఆదేశించారు. ఓటర్లను ప్రభావితం చేయడానికి డబ్బు, మద్యం, రాకుండా చెక్‌పోస్టుల వద్ద ఇతరశాఖల సమన్వయంతో తనిఖీలు చేయాలని చెప్పారు. సమస్యాత్మక ప్రాంతాల్లో ఫ్లాగ్ మార్చ్ నిర్వహించాలని, సోషల్ మీడియాపై నిఘా ఉంచాలన్నారు. లాడ్జీలు, గెస్ట్‌హౌస్‌లు, కమ్యూనిటీ హాలులు, ఫంక్షన్ హాలులో నిరంతరం తనిఖీలు నిర్వహించాలన్నారు. ఎన్నికలకు సంబంధించిన అంశాల్లో, రాజకీయ కార్యక్రమాల్లో పోలీస్ సిబ్బంది ఎలాంటి ప్రమేయం ఉండకూడదని హెచ్చరించారు. విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు.

కార్యకర్తల ఏకాభిప్రాయంతోనే అభ్యర్థుల ఎంపిక

● బీఆర్ఎస్ పార్టీ గద్వాల ఇన్‌చార్జి బాసు హనుమంతు నాయుడు



ధరూర్‌లో నాయకులు, కార్యకర్తలతో మాట్లాడుతున్న బాసు హనుమంతు నాయుడు

ధరూరు, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి) : స్థానిక ఎన్నికల్లో నిత్యం ప్రజల మధ్యలో ఉంటూ వారి సమస్యల పట్ల పోరాటం చేస్తున్న నాయకులను అభ్యర్థులుగా ఎంపిక చేయాలన్న కార్యకర్తల అభిప్రాయం మేరకు అభ్యర్థుల ఎంపిక ఉంటుందని బీఆర్ఎస్ గద్వాల నియోజకవర్గ ఇన్‌చార్జి బాసు హనుమంతు నాయుడు అన్నారు. సర్పంచు ఎన్నికల సందర్భంగా గురువారం ధరూర్‌లో నాయకులు, కార్యకర్తలతో సన్నాహక సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలను అమలు చేయకుండా ప్రజలను మభ్యపెట్టి ఓట్లను దండుకునేందుకు చేస్తున్న ప్రయత్నాన్ని ప్రజలు తిప్పికొట్టాలన్నారు. కామారెడ్డి డిక్లరేషన్‌లో 42శాతం బీసీలకు రిజర్వేషన్లు కల్పిస్తామని ఆశలు కల్పించి నమ్మకద్రోహం చేసిందన్నారు. మొత్తంగా బీసీలకు 17 శాతం రిజర్వేషన్లు ఇచ్చిందని, కొన్ని జిల్లాల్లో బీసీలకు మూడు నుంచి నాలుగు శాతం రిజర్వేషన్లు కూడా అమలు కాలేదన్నారు. ప్రజలకు కేసీఆర్ హయాంలో జరిగిన అభివృద్ధిని వివరిస్తూ, కాంగ్రెస్ పాలనలో విఫలమైన విషయాలను గ్రామ బ్రాహ్మణ ప్రజలకు స్పష్టంగా వివరించాలని నాయకులు, కార్యకర్తలకు సూచించారు. సమావేశంలో వెంకటేశ్వర్ రెడ్డి, చక్రదర్ రావు, రాజారెడ్డి, శ్రీనివాస్ గౌడ్, వెంకటేశ్ నాయుడు, సుభాష్, రంగారెడ్డి, వెంకటేశ్ యాదవ్, గోవిందు, నరసింహులు, రాము, రంగన్న, వీరేశ్, రాముడు ఉన్నారు.

సానుకూల దృక్పథంతోనే విజయానికి బాటలు

● మాస్టర్ ట్రైనర్ మహేశ్



విద్యార్థినులతో మాట్లాడుతున్న మాస్టర్ ట్రైనర్ మహేశ్

గద్వాల టౌన్, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): వ్యక్తిలోని సానుకూల దృక్పథమే విజయానికి బాటలు వేస్తుందని డీఆర్‌డీఏ-ఈజీఎంఎం మాస్టర్ ట్రైనర్ మహేశ్ అన్నారు. విజయం అనేది వైఫల్యానికి వ్యతిరేకం కాదని, విజయం మెరుగైన చర్యల సారాంశమని విద్యార్థినులకు వివరించారు. కలెక్టర్ ఆదేశాల మేరకు గురువారం పట్టణ సమీపంలోని కేజీబీవీ పాఠశాల పదవ తరగతి విద్యార్థినులకు పరీక్షల ఉత్సాహభరిత శిక్షణ కోసం ప్రేరణ తరగతులు నిర్వహించారు. ఈసందర్భంగా విద్యార్థినులతో మాట్లాడిన మహేశ్, చదువు కోవడం కష్టం అని భావించకుండా దీన్ని నేర్చుకుంటున్నాను, ఇది నా జీవితం మారుస్తుంది అన్న దృక్పథంతో పలుమార్లు మనసులో అనుకుంటూ చదువుకోవాలన్నారు. మొబైల్, టీవీలకు దూరంగా ఉండాలని, అలసటగా ఉన్న సమయంలో చిన్నపాటి వ్యాయామం ద్వారా శారీరక శక్తిని పెంచుకుని తిరిగి చదువు ప్రారంభించాలన్నారు. పనులను వాయిదా వేయకుండా ముందస్తు ప్రణాళికలతో అలవాటుగా మార్చుకోవాలన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ శ్రీదేవి, ఉపాధ్యాయులు ఉన్నారు.

స్ట్రాంగ్ రూమ్ వద్ద భద్రత పటిష్టంగా ఉండాలి

● కలెక్టర్ బీఎం సంతోష్



స్ట్రాంగ్ రూమ్‌లో రికార్డులను పరిశీలిస్తున్న కలెక్టర్ బీఎం సంతోష్

గద్వాల న్యూటౌన్, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): ఈవీఎంలు భద్రపరిచిన స్ట్రాంగ్ రూమ్ వద్ద భద్రత పటిష్టంగా ఉండాలని కలెక్టర్ బీఎం సంతోష్ అన్నారు. కలెక్టర్ కార్యాలయ ఆవరణలో గల గోదాములో ఎలక్ట్రిక్ ఓటింగ్ మిషన్లు(ఈవీఎం)లు భద్రపరిచిన స్ట్రాంగ్‌రూమ్‌ను కలెక్టర్ గురువారం సంబంధిత అధికారులు, వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో కలిసి తనిఖీ చేశారు. జిల్లాకు సంబంధించిన ఈవీఎంలు భద్రపరిచిన స్ట్రాంగ్ రూమ్‌తో పాటు భద్రత నిర్వహణ పరిశీలించారు. రికార్డులను తనిఖీ చేశారు. సీసీ కెమెరాలు పనితీరును పరిశీలించారు. కార్యక్రమంలో గద్వాల తహసీల్దార్ మల్లికార్జున్, ఎన్నికల విభాగం సూపరింటెండెంట్ కరుణాకర్, రాజకీయ పార్టీల ప్రతినిధులు ఉన్నారు.

దీక్షా దివస్ పోస్టర్ల ఆవిష్కరణ



పోస్టర్లను ఆవిష్కరిస్తున్న బాసు హనుమంతునాయుడు, నాయకులు

గద్వాల న్యూటౌన్, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రంలోని బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో గురువారం దీక్షా దివస్ పోస్టర్లను బీఆర్ఎస్ నియోజకవర్గ అధ్యక్షుడు బాసు హనుమంతునాయుడు విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈనెల 29న జరిగే దీక్షా దివస్ కార్యాక్రమాన్ని కార్యకర్తలు జయప్రదం చేయాలన్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు రజినిబాబు, ముని, గంగాధ ర్, రవి, రమేశ్, మధు, బీఆర్ఎస్వీ జిల్లా కోఆర్డినేటర్ కుర్వ పల్లయ్య, నాయకులు ప్రకాష్, మహేష్, శ్రీను నాయక్, రాజు, సాయి, తిరుమలేశ్ ఉన్నారు.

నైపుణ్య శిక్షణతో ఉపాధికి మార్గం

గద్వాల టౌన్, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): విద్యార్హతలతో పాటు వృత్తి సంబంధ నైపుణ్యం ఉంటేనే మెరుగైన ఉపాధి అవకాశాలు లభిస్తాయని ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ రామ్మోహన్ అన్నారు. ఇందుకోసం మాస్టర్ ట్రైనర్లు ఇస్తున్న శిక్షణను అవకాశంగా అందిపుచ్చుకోవాలన్నారు. గురువారం పట్టణంలోని ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో విద్యార్థులకు హైదరాబాద్‌కు చెందిన నిర్మాన్ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో కమ్యూనికేషన్, ఇంటర్వ్యూ స్కిల్స్‌పై అవగాహన కార్యక్రమం ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో మాట్లాడిన సంస్థ ట్రైనర్ శ్రీవీర, విద్యార్హతల ద్వారా అవకాశం ఉండే ఉద్యోగాలు, ఎంపిక కోసం హాజరయ్యే ఇంటర్వ్యూలో ప్రవర్తించే తీరు, రెజ్యూమ్ తయారీ, స్వీయ విశ్వాసం పెంపొందించుకునే విధానం వివరించారు. ప్లేస్‌మెంట్ ఆఫీసర్ నవీన్‌రెడ్డి మాట్లాడుతూ పరిశ్రమల అవసరాలకు అనుగుణంగా నైపుణ్యాలు మెరుగుపరచుకోవాలని చెప్పారు.

న్యూస్ బాక్స్

శివాలయం పునర్నిర్మాణానికి విరాళం అందజేత



కమిటీ సభ్యులకు విరాళం అందజేస్తున్న దాత

గద్వాలఅర్బన్,నవంబరు27 (ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రంలోని నల్లకుంటలో చేపట్టిన శ్రీశ్రీ భ్రమరాంబికదేవి, మల్లికార్జునస్వామి దేవాలయ పునర్నిర్మాణానికి నాయకులు, స్థానికులు, విరాళాలు అందజేశారు. గురువారం స్థానిక కార్యాలయంలో కమిటీ సభ్యులకు మాజీ మునిసిపల్ చైర్మన్ జి.వేణుగోపాల్ రూ.75వేలు, అల్లపాడు శ్రీధర్ గౌడ్ రూ.25వేలు చందారాసి నగదును ఇచ్చారు. విరాళాలు అందజేసిన దాతలకు ధన్యవాదాలు తెలుపుతూ వారి కుటుంబసభ్యులకు శివుని కృపాకటాక్షం ఎల్లవేళలా ఉండాలని కమిటీ చైర్మన్, సభ్యులు ఆకాంక్షించారు. గుడి నిర్మాణంలో ఉన్నందున ఎవరైనా దాతలు ముందుకు వచ్చి సహృదయంతో చేయూతనందించాలని శివాలయం కమిటీ చైర్మన్, మాజీ కౌన్సిలర్ పులిపాటి వెంకటేశ్ కోరారు. కార్యక్రమంలో శివాలయం కమిటీ ఉపాధ్యక్షుడు గుమ్మడం గోపాల్, వెంకట్రాములు, కోశాధికారి శాసనూరు నాగరాజు శెట్టి, కార్యదర్శి కటిక బాలాజీ ఉన్నారు.

నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీడీవో రాఘవ

మానవపాడు,నవంబరు27 (ఆంధ్రజ్యోతి): స్థానిక ఎన్నిక సమరం ప్రారంభమైందని, ప్రతీ గ్రామంలో పంచాయతీ అధికారులు, జీపీవోలు అందుబాటులో ఉండి ఎన్నికల అధికారులకు సహకారం అందించాలని ఎంపీడీవో రాఘవ అన్నారు. గురువారం మండల పరిషత్ కార్యాలయంలో కార్యదర్శులకు, జీపీవోలకు ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేసిమాట్లాడారు. మండలంలో మూడో విడత ఎన్నికలు జరుగుతాయని, ముందస్తుగా పోలింగ్ కేంద్రాల వద్ద సదుపాయాలు పరిశీలించుకోవాలని, వార్డుల వారీగా ఓటర్లు జాబితా అందుబాటులో ఉండాలని సూచించారు. సమావేశంలో తహసీల్దార్ జోషి శ్రీనివాస్ శర్మ, హెచ్‌సీ తిప్పన్న పాల్గొన్నారు.

బిజ్వారంలో టీబీ పరీక్షలు

- టీబీ ముక్త్ అభియాన్ ఆధ్వర్యంలో నిర్వహణ



బిజ్వారంలో హెల్త్ క్యాంపు నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది

మల్దకల్, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని బిజ్వారంలో గురువారం అధికారులు టీబీ ముక్త్ అభియాన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రోగ్రాం అధికారి రాజు ఆధ్వర్యంలో కొనసాగింది. అలాగే బిజ్వారం గ్రామంతో పాటు మేకలసోంపల్లెలో టీబీ హైరిస్క్‌గా ఉన్న అనుమానితులకు ప్రత్యేక ఎక్స్‌రే పరికరం ద్వారా రోగ నిర్ధారణ పరీక్షలు నిర్వహించారు. సాధారణ పరీక్షలు శ్వాసకోశ సంబంధిత వ్యాధులు, బరువు తక్కువగా ఉన్న వారికి,పాత టీబీ రోగాలకు, రక్తపోటు, డయాబెటీస్ పరీక్షలు నిర్వహించారు. మల్దకల్ వైద్యాధికారి స్వరూపరాణి వ్యాధిగ్రస్తులకు పలుసూచనలు సలహాలు అందజేశారు. కార్యక్రమంలో డాక్టర్ ప్రణీత, సూపర్‌వైజర్లు శ్రీధర్ జయరాములు, దేవన్న, వైద్యసహాయకులు అజూబా, మరియమ్మ పాల్గొన్నారు.

జార్జిరెడ్డి పీడీఎస్‌యూ కమిటీ ఏర్పాటు

గట్టు, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో గురువారం జిల్లా కమిటీ ఆధ్వర్యంలో జార్జిరెడ్డి పీడీఎస్‌యూ మండల కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా స్టీఫెన్‌సన్, ఉపాధ్యక్షునిగా శివానంద, ప్రధాన కార్యదర్శిగా రాజు, సహాయ కార్యదర్శిగా ఇమ్మానియేలు, కోశాధికారిగా దేవేంద్రను, కమిటీ సభ్యులను ఎన్నుకున్నారు. ఈసందర్భంగా కళాశాలలో విద్యారంగ సమస్యలపై చర్చించారు. రాష్ట్రంలో విద్యావ్యవస్థను అభివృద్ధి చేయడంలో రాష్ట్ర ప్రభుత్వం విఫలమైందన్నారు.

పెండింగ్ బిల్లులు చెల్లించాలి

● టీఎస్‌యూటీఎఫ్ డిమాండ్

గట్టు, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): పెండింగ్‌లో ఉన్న బిల్లులను ప్రభుత్వం వెంటనే చెల్లించాలని టీఎస్‌యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు డీ.రమేశ్ గురువారం డిమాండ్ చేశారు. సభ్యత్వ నమోదు కార్యక్రమంలో భాగంగా గట్టు మండలంలో పర్యటించారు. ప్రభుత్వం అధికారంలోకి వచ్చి రెండేళ్లు కావస్తున్నా ఇంతవరకు ఉపాధ్యాయ, ఉద్యోగ సమస్యలు పరిష్కరించడంలో తాత్సారం చేస్తున్నారని అన్నారు. పెండింగ్‌లో ఉన్న బిల్లులు చెలించాలన్నారు. కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి గోపాల్, కార్యదర్శి చంద్రకాంత్ వదన్, సతీశ్, సురేశ్ పాల్గొన్నారు.

విద్యుత్ సమస్య లేకుండా చూస్తాం



జల్లాపురంలో విద్యుత్ లైన్‌ను పరిశీలిస్తున్న డీఈ తిరుపతిరావు, సిబ్బంది

● డీఈ తిరుపతిరావు

మానవపాడు, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గ్రామాల్లో విద్యుత్ సమస్యలు లేకుండా ముందస్తు చర్యలు తీసుకుంటున్నామని గద్వాల డీఈ తిరుపతిరావు అన్నారు. గురువారం మండల కేంద్రంలోని వివిధ కాలనీల్లో పర్యటించి సమస్యలపై ప్రజలకు అడిగి తెలుసుకున్నారు. గ్రామంలో ఉన్న ట్రాన్స్‌ఫార్మర్ల చుట్టూ కంచెను ఏర్పాటు చేయాలని, గతంలో ప్రమాదాలు జరిగిన విషయాన్ని గుర్తు చేశారు. కొన్ని కాలనీల్లో వైర్లు ఇళ్లపై నుంచి వెళ్లడం వల్ల ఇబ్బందులు పడుతున్నామని తెలిపారు. గ్రామంలో ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూడాలని, ఇష్టానుసారంగా ఎల్‌సీలు తీసుకోవడం తప్పని, ప్రభుత్వ కార్యాలయాల్లో పనులకు ఆటంకం కలిగించవద్దని సిబ్బందికి సూచించారు. ఏఈ సుబ్బరాయుడు, అధికారులు పాల్గొన్నారు.

టీపీయూఎస్ మండల కమిటీ ఏకగ్రీవం

గద్వాలసర్కిల్, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం (టీపీయూఎస్) గద్వాల మండల నూతన కమిటీ ఏకగ్రీవంగా ఏర్పాటు అయింది. గద్వాలలోని ఓ ప్రైవేట్ డిగ్రీ కళాశాలలో జిల్లా అధ్యక్షుడు పీ మనోహర్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి ఐ శ్రీధర్‌రెడ్డి, ఎన్నికల అధికారి వి.నరేశ్ ఆధ్వర్యంలో గురువారం కమిటీ ఎన్నికలు నిర్వహించారు. గద్వాల మండల అధ్యక్షుడిగా ఎం.వెంకటేశ్ (ఎస్జీటీ, ఎంపీపీఎస్ శెట్టి అగ్రహారం), ప్రధాన కార్యదర్శిగా ఎస్ రవి (ఎస్జీటీ, ఎంపీపీఎస్ పూడూర్), కన్వీనర్‌గా మధు (ఎస్జీటీ, ఎంపీపీఎస్ అనంతపూర్), కో-కన్వీనర్‌గా ఎం.రమేశ్ (ఎస్జీటీ, ఎంపీయూపీఎస్ వెంకంపేట) ఎన్నికయ్యారు.

ఆధ్యాత్మిక జాగృతి చాలా అవసరం

● ఓం శాంతి గద్వాల ఇన్‌చార్జి మంజుల బెహెన్ జీ

గద్వాల సర్కిల్, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): విద్యార్థుల ఏకాగ్రత పెంపుదలకు ఆధ్యాత్మిక జాగృతి చాలా అవసరమని ఓం శాంతి బ్రహ్మకుమారీస్ ఈశ్వరీయ విశ్వవిద్యాలయం గద్వాల ఇన్‌చార్జి మంజుల బెహెన్ జీ పేర్కొన్నారు. గద్వాలలోని దౌదర్‌పల్లి ఎంపీహెచ్ఎస్‌లో రాజస్థాన్ రాష్ట్రం మౌంట్ ఆబులో ఉన్న ఓంశాంతి ప్రధాన కేంద్రం నుంచి వచ్చిన ప్రచార రథం ద్వారా మత్తు పదార్థాల నియంత్రణపై మంజుల బెహెన్‌జీ విద్యార్థులకు అవగాహన కల్పించారు. మత్తుపదార్థాల వాడకం వల్ల ఆరోగ్యం చెడిపోవడంతో పాటు ప్రాణాలు కోల్పోయే ప్రమాదం ఉందని వివరించారు. ఎట్టి పరిస్థితుల్లోనూ మత్తు పదార్థాల జోలికి పోరాదని సూచించారు. ఆరోగ్యవంతమైన జీవనం కొరకు యోగా, ఆధ్యాత్మికను పెంపొందించే ధ్యానం అలవాటు చేసుకోవాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్ఎం వేణుగోపాల్‌రెడ్డి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

బాల్య వివాహాలు చట్ట విరుద్ధం



ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాల విద్యార్థులతో మాట్లాడుతున్న న్యాయవాది రాజేందర్

● న్యాయవాది రాజేందర్

● ఉన్నత పాఠశాల విద్యార్థులకు అవగాహన

గద్వాల టౌన్, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): బాల్య వివాహాలు చట్టరీత్యా నేరమేకాక ఆరోగ్య పరంగా, భవిష్యత్ పరంగా ప్రమాదకరమని న్యాయవాది వి.రాజేందర్ అన్నారు. సామాజిక రుగ్మతగా మారిన బాల్యవివాహాలను పూర్తిగా నిర్మూలించాల్సిన అవసరం ఉందన్నారు. జిల్లా న్యాయ సేవా అధికార సంస్థ ఆధ్వర్యంలో గురువారం పట్టణంలోని ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాల విద్యార్థులకు బాల్యవివాహాల వ్యతిరేక అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడిన న్యాయవాది, 18ఏళ్లలోపు వయస్సు గల బాలబాలికలకు వివాహం జరిపించడం వల్ల అనారోగ్య సమస్యలు తలెత్తడంతో పాటు బాలుర భవిష్యత్ జీవిత లక్ష్యాలు సైతం నీరుగారే ప్రమాదం ఉందన్నారు. బాల్య వివాహాలు జరిపించిన తల్లిదండ్రులు, పెద్దలు, పురోహితులతో సహ సంబంధిత వారందరికీ రెండు సంవత్సరాల జైలుశిక్ష లేదా ఒక లక్ష రూపాయల జరిమానా లేదంటే రెండు శిక్షలు విధించబడే అవకాశం ఉంటాయన్నారు. బాలల హక్కుల పరిరక్షణ చట్టాలు వారి భద్రత, ఆరోగ్యం, విద్యను కాపాడేందుకేనన్నారు. ఉన్నత విద్యార్థులుగా రాణించి జీవితంలో సుస్థిర స్థానం దక్కించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో న్యాయవాది శ్రీనివాసులు, హెడ్‌మాస్టర్ రేణుకదేవి, రూరల్ డెవలప్‌మెంట్ కోఆర్డినేటర్ చంద్రశేఖర్, పీడబ్ల్యూవో సునంద ఉన్నారు.

వచ్చే నెల 7 వరకు ఓపెన్ టెన్త్, ఇంటర్‌లో ప్రవేశాలు

గద్వాల సర్కిల్, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ ఓపెన్ స్కూల్ (టాస్) ఆధ్వర్యంలో కొనసాగుతున్న ఓపెన్ టెన్త్, ఇంటర్‌మీడియట్‌లో ప్రవేశాల దరఖాస్తులను అపరాద రుసుముతో ఈనెల 29 నుంచి డిసెంబర్ 7వ తేదీ వరకు స్వీకరిస్తున్నట్లు ఓపెన్ స్కూల్ జిల్లా కో-ఆర్డినేటర్ సునీతమ్మ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. టాస్ డైరెక్టర్ పీవీ శ్రీహరి ఆదేశానుసారం ఈ అవకాశం కల్పించామని, ఆసక్తి గల అభ్యర్థులు తెలంగాణ ఓపెన్ స్కూల్/ మీ సేవా కేంద్రం/ టీజీ ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. పూర్తి వివరాలకు డీఈవో కార్యాలయంలోని ఓపెన్ స్కూల్ విభాగంలో లేదా సమీపంలోని అధ్యయన కేంద్రాలలో సంప్రదించాలని పేర్కొన్నారు.

పంచాయతీ ఎన్నికలు పకడ్బందీగా నిర్వహించాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మార్వో, ఎంపీడీవో

● ఎమ్మార్వో ప్రభాకర్, ఎంపీడీవో తిరుపతన్న

ఉండవల్లి, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి) : రాబోయే గ్రామ పంచాయతీ ఎన్నికలను ఎలాంటి అవకతవకలకు తావులేకుండా, పారదర్శంగా నిర్వహించాలని ఉండవల్లి తహసీల్దార్ ప్రభాకర్, ఎంపీడీవో తిరుపతన్న అధికారులను ఆదేశించారు. గురువారం ఉండవల్లి మండల కేంద్రంలోని మండల పరిషత్ కార్యాలయంలో అధికారులు, పంచాయతీ కార్యదర్శులతో సమావేశం నిర్వహించారు. ఎన్నికల నిర్వహణలో నిబంధనలను కచ్చితంగా అమలు చేయాలని, ముఖ్యంగా నామినేషన్ పత్రాల స్వీకరణ, పరిశీలన ఆమోద ప్రక్రియలో జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎన్నికల షెడ్యూల్‌ను ముందస్తుగా ప్రకటించిన నేపథ్యంలో ప్రతి అధికారి తన బాధ్యతలను స్పష్టంగా గుర్తించి శ్రద్ధతో విధులు నిర్వర్తించాలన్నారు. ఎన్నికల సమయంలో గ్రామాల్లో ప్రశాంత వాతావరణ ఉండేలా అవసరమైన చర్యలు చేపట్టాలని, ఎలాంటి ఫిర్యాదులు తలెత్తకుండా ముందస్తు జాగ్రత్తలు అవసరమన్నారు. విధుల్లో నిర్లక్ష్యం, రాజకీయ ఒత్తిళ్లకు లోనయ్యే పరిస్థితులు ఏర్పడితే సంబంధిత అధికారులపై కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ప్రజాస్వామ్యానికి మూలస్థంభమైన పంచాయతీ వ్యవస్థ బలోపేతానికి ఎన్నికలు కీలకమని, అందుకు ప్రతీ దశలో న్యాయం, సమానత్వం పాటించాలని సూచించారు. ఎన్నికల విధుల్లో పారదర్శకతతో పాటు బాధ్యతాయుతంగా వ్యవహరించాలన్నారు.సమావేశంలో మండల స్థాయి అధికారులు, గ్రామ కార్యదర్శులు ఉన్నారు.